1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
ఆదివారం | మార్చి 31, 2024 | www.navatelangana.com

## నేడు ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ పర్యటన



- ఎండిపోయిన వరిచేల పరిశీలన

నవతెలంగాణ-నల్లగొండటౌన్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నేడు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. నేడు ఉదయం 11:30 గంటలకు తుంగతుర్తి, అర్వపల్లి, సూర్యాపేట మండలాల్లో పర్యటించి ఎండిపోయిన పంటచేలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు సూర్యాపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడ్తారు. 4:30 గంటలకు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో ఎండిపోయిన పంటచేలను పరిశీలించనున్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఆంజనేయులు



నవతెలంగాణ-దేవరకొండ

దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు ఎన్నికయ్యారు. శనివారం దేవరకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎండి శౌకత్ అలీ, ఉపాధ్యక్షులు కర్నాటి సురేష్, సహ కారదర్శి వనం పుష్పలత, కోశాధికారి ఇడెం రవికుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ కోరే శ్రీనివాస్, మరియు కార్యవర్గ సభ్యులు బోడ్డు ఆంజనేయులు, జున్ను ఇద్దయ, కోరే కిషన్, రమావత్ గణేష లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి గా ఇడెం రవి కుమార్, సహయ అధికారి సపావత్ శ్రీకాంత్ లు వ్యవహరించారు. అధ్యక్షులుగా గాజుల ఆంజనేయులు ఎన్నిక పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు .

# నీలగిరి నిప్పుల కొలిమి



- నాంపల్లి లో 43. డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రత
- జిల్లాలో దంచి కొడుతున్న ఎండలు
- పెరుగుతున్న విద్యుత్తు వినియోగం

నల్గొండ జిల్లాలో భానుడు నిప్పుల కొలిమిలా మండుతున్నాడు. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎండ తీవ్రత నెత్తిన నిప్పుల కుంపటిగా మారింది. నల్గొండ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలను వాతావరణ శాఖ ఆరెంజ్ జోన్‌గా ప్రకటించింది.

నవతెలంగాణ -నల్లగొండ టౌన్

నల్లగొండ జిల్లాలోని నాంపల్లి మండలంలో శనివారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న నాలుగు రోజుల్లో ఎండలు మరింత ముదురుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. విద్యాసంస్థలకు వేసవి సెలవులు రావడంతో పిల్లలను ఎండలో ఆడుకోనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం వేళ తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని, ఎండ వేడిమి నుంచి రక్షణకు కనీస జాగ్రత్తలు పాటించాలని కోరుతున్నారు. ఎండలు ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటాయోనని జనంలో ఆందోళన మొదలైంది.

**కరెంటు వినియోగంపై ప్రభావం...**

సూర్య ప్రతాపంతో ఉపాధిహామీ, వ్యవసాయ కూలీలు పనులకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. వేడి గాలులు, ఉక్కపోతలతో ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి ప్రజలు కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు ఉపయోగించడంతో విద్యుత్తు వినియోగం భారీగా నమోదవుతోంది. నల్గొండ జిల్లాలో సాధారణ రోజుల్లో 11 మిలియన్ యూనిట్లు (మి.యూ.) వినియోగం ఉండగా, ప్రస్తుతం 12.46 మి.యూ.కు పెరిగింది. ఉమ్మడి జిల్లాలో పరిశీలిస్తే సాధారణ వినియోగం 22.3 మి.యూ నుంచి 32 మి.యూకు పెరిగింది.

**జిల్లాలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న ఆరెంజ్ మండలాలు...**

నల్లగొండ జిల్లాలో 40 డిగ్రీలు ఉష్ణోగ్రత దాటిన మండలాలను ఆరెంజ్ జోనుగా ప్రకటించారు.నల్లగొండ, కనగల్, పీఏ పల్లి, నాంపల్లి, మాడుగులపల్లి, చందంపేట, నిడుమనూరు, వేములపల్లి, దామరచర్ల, కట్టంగూర్, కొండమల్లేపల్లి, తిరుమలగిరి సాగర్, నేరేడుగొమ్మ హాలియా, పెద్దవూర, మునుగోడు, అడవిదేవులపల్లి, చండూర్, మిర్యాలగూడ, త్రిపురారం, తిప్పర్తి, గుర్రంపోడు, చిట్యాల, దేవరకొండ మండలాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి.

**జాగ్రత్తలే రక్ష....**

నిప్పుల కొలిమికి ఉమ్మడి జిల్లా పేరు పడింది. నీలగిరిలో గుట్టల ప్రభావంతో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో చాలా వరకు వడదెబ్బ ప్రభావం చూపనుంది. గత ఏడాదిలో వడదెబ్బతో పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వైద్య ఆరోగ్యశాఖ జాగ్రత్తలు, ఆహార నియమాలు సూచిస్తోంది. నీరు, మజ్జిగ, పండ్లరసాలు అధికంగా తీసుకోవాలని, పుచ్చకాయ, కర్బూజా వంటి పండ్లను తినాలని పేర్కొంటోంది. సాధ్యమైనంతవరకు ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయట పనులు పూర్తి చేసుకోవాలని, శరీరానికి వేడి తగలకుండా చూసుకోవాలని సూచిస్తోంది. బయటకు వెళితే తలకు టోపీ, రుమాలు చుట్టుకోవాలని, తెలుపురంగుతో కూడిన దుస్తులు ధరించాలని, వడదెబ్బ తగిలినట్లు భావిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని కోరుతోంది.

**కనీస జాగ్రత్తలు పాటించాలి**

**డాక్టర్ కొండల్‌రావు, నల్లగొండ జిల్లా వైద్యాధికారి**



వేసవిలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలి. సాధ్యమైనంతవరకు ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయట పనులు పూర్తి చేసుకోవాలి. బయటకు వెళితే తలకు టోపీ, రుమాలు చుట్టుకోవాలని, తెలుపురంగుతో కూడిన దుస్తులు ధరించాలని, వడదెబ్బ తగిలినట్లు భావిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి. వాతావరణ పరిస్థితుల బట్టి ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలి. సీజనల్ జ్వరాలపై వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలకు ఆరోగ్యసలహాలు, సూచనలు చేస్తు న్నాం.



## నాటికలు సమాజ మార్పునకు తోడ్పడాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- జాతీయస్థాయి పద్య , సాంఘిక నాటిక పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-మిర్యాలగూడ

నాటికలు సమాజ మార్పునకు తోడ్పడాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ మిర్యాలగూడ సంస్కృతిక కళా కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నందిని నాటక ఉత్సవాలు ప్రారంభానికి ఆయన, మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, 14వ వార్డు కౌన్సిలర్ గంధం రామకృష్ణ గారు హాజరై జ్యోతి ప్రజ్వలనతో నాడక్క పోటీలను ప్రారంభించారు. సభ వేదికకు మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ళ రామచందర్ రావు అధ్యక్షత వహించారు. సంస్థ ఏర్పడిన నాటి నుండి ఈనాటి వరకు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఈ రోజున కళాభారతి ఆడిటోరియంలో నాటకోత్సవాల జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ ఈ



నాటికలు సమాజా మార్పునకు తోడ్పడేదిగా ఉండాలని..అలాగే నేటి యువతకు ఈ నాటికల విలువలపై అవగాహన కల్పించే విధంగా ఉండాలన్నారు. అనంతరం 'రాత' సాంఘిక నాటిక వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు ఎన్టీఆర్ జిల్లా వారిచే ప్రదర్శించడం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు 'మనోరమ' పద్య నాటకం శ్రీ విఘ్నేశ్వర నవ్య కళా సమితి బాపట్ల వారిచే ప్రదర్శించారు. సాయంత్రం 6గం.లకు 'నాన్న నేను వచ్చేస్తా' సాంఘిక నాటిక శ్రీ అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారిచే ప్రదర్శించారు.రాత్రి 7గంటలకు 'మూల్యం' సాంఘిక నాటిక గోవాడ క్రియేషన్స్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే ప్రదర్శించారు. అద్భుతమైన సాంఘిక పౌరాణిక పద్య నాటకములు మన మిర్యాలగూడ కళాభారతి మినీ రవీంద్ర భారతి నందు ప్రదర్శింపబడినవి. ప్రేక్షకులు నాటకాలు తిలకించి చప్పట్లతో కళాకారులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్షులు బోయినపల్లి భుజంగరావు, గ్యార సాయిలు, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి శర్మ, కోశాధికారి పుల్లాభట్ల లక్ష్మీనారాయణ శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి రామావతారం, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్, పయ్యావుల శ్రీనివాస రావు, బాపనయ్య, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 370 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- డీఎస్ఓ వెంకటేశ్వర్లు



చిట్యాలటౌన్

నవతెలంగాణ-చిట్యాలటౌన్

యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 370 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు డీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరి కోతలు పూర్తయిన ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు, నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించామన్నారు. ముఖ్యంగా తాగునీరు, ఉండేందుకు నీడతో పాటు, ఆశ ,అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను సైతం సిద్ధంగా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ ఆర్. కిరణ్ కుమార్, సీఈవో బ్రహ్మచారి, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నాగరాజు, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, నరేష్, యాదయ్య,పాల్గొన్నారు.

**కట్టంగూర్ :** మండలంలోని ఐటిపాముల గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం డిసిఎస్ ఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిఎం నాగేశ్వరరావు, డీసీఓ కిరణ్ కుమార్, సూపరిండెండెంట్ విజయ్ కుమార్, డీటీసీఎస్ జ్యోతి,వ్యవసాయ అధికారి శివరాం, విస్తరణ అధికారి రమణ, పీఏసీఎస్ సీఈవో బండ మల్లారెడ్డి, సిబ్బంది చెరుకు చంద్రయ్య, యాదగిరి,రాంబాబు ఉన్నారు.

**నల్గొండ కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్బీసీ రోడ్డు, కంచన పల్లి, గుండ్లపల్లిలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వరిధాన్యం బస్తాల పైన తార్పాల్ తో జాగ్రత్త తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా చీకటి సమయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సౌకర్యం కూడా కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి

- ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్


ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్, హెూమ్ ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి- విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అడిషనల్ సీఈవోలు సర్ఫరాజ్ అహ్మద్, లోకేష్ కుమార్లు పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది రాండమైజేషన్ తదితర అంశాలపై వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, రెవెన్యూ అదనపుకలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి .పూర్ణ చందర్, డిఆర్వో రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఏఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహానికి ముసుగు తొలగించాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగర్జున

నవతెలంగాణ-నల్గొండకలెక్టరేట్

మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహానికి వేసిన ముసుగును తొలగించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున క్లాక్‌టవర్ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిబంధన ప్రకారం రాజకీయ నాయకులకు ముసుగులు వేస్తారు కానీ ఎలాంటి రాజకీయాలకు సంబంధం లేని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి తెల్లటి గుడ్డలతో ముసుకు కప్పడం సరికాదన్నారు. గతంలో జరిగిన ఏ ఎన్నికలలో కూడా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబాపూలే విగ్రహాలకు ముసుగులు కప్పబడి లేవన్నారు. కానీ నేడు మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి ముసుగు కప్పారని ఒక సారి పరిశీలన జరిపి ముసుగు తొలగించాలని కోరారు.



## మృతదేహంతో ఇంటి ముందు నిరసన



నవతెలంగాణ-మిర్యాలగూడ

తనకు న్యాయం చేయాలని కోరుతూ మృతదేహంతో ఇంటిముందు నిరసన తెలిపిన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వేళల ప్రకారం పెన్ పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన చందనకు మిర్యాలగూడ పట్టణం శాంతినగర్ చెందిన ఆనందం వేణు తో మూడేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 18 నెలల బాబు ఉన్నాడు. భర్త ఖమ్మంలోని కొత్తగూడెం రైల్వే స్టేషన్లో ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంగా చందనను అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేణుతో పాటు అత్త విజయలక్ష్మి వేధింపులు చేయగా చందన తల్లి గారి ఇంటి వద్దనే ఉంటుంది. వరకట్న వేధింపులపై సంవత్సర క్రితం చందన కేసు పెట్టడంతో ఆ కేసును ఉపసంహరించుకోవాలని భర్త వేణు తో పాటు అత్త విజయలక్ష్మి బెదిరించడంతో శుక్రవారం నాగులపాటి అన్నారం గ్రామంలో తమ ఇంటిలో ఫ్యాన్ కు ఉరేసుకుని చందన ఆత్మహత్య చేసుకుంది. చందన ఆత్మహత్యకు భర్త వేణు, అత్త విజయలక్ష్మి కారణమని చందన కుటుంబ సభ్యులు మృతదేహంతో ఇంటి ముందు నిరసన తెలిపారు. తమ కూతురు మృతికి కారణమైన భర్త ,అత్తపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

## సాగర్‌ను సందర్శించిన యూఎస్ఏ దమ్మా ఫౌండేషన్ సీఈఓ

నవతెలంగాణ-నాగార్జునసాగర్

అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ ను శనివారం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా దమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,సీఈఓ శ్రీలంక బౌద్ధ గురువు నివిటి గాల బంతే ఆధ్వర్యంలో శ్రీలంకకు చెందిన సుగత కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహా లడువే నంద రతన బంతే సందర్శించారు. నాగార్జునసాగర్ లోని బుద్ధ వనాన్ని సందర్శించిన వీరు బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ,వందన సమర్పించిన అనంతరం మహాస్తుపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో శ్రీలంక బౌద్ధ సాంప్రదాయ బద్ధంగా చాంటింగ్ చేశారు. అనంతరం వీరు నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. వీరితోపాటు సికింద్రాబాద్ ఆనంద బుద్ధ విహార సంఘ పాల బంతే , ఏలే నాగన్న కొండ మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ ,స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ, బుద్ధవనం సూపర్‌వైజర్ విష్ణు తదితరులు ఉన్నారు.

## మర్రిగూడ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



నవతెలంగాణ-మర్రిగూడ

మండల ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి (బీఆర్ఎస్) పై సొంత పార్టీ సభ్యులే పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు నెగ్గింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చండూరు ఇన్‌చార్జి ఆర్డీవో డి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అవిశ్వాస సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ముగ్గురు ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గాలంటే ఏడుగురు సభ్యులే కావలసి ఉండగా ఎనిమిది మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి చేతులెత్తారు.దీంతో ఎంపీపీ పై అవిశ్వాసం నెగ్గినట్టుగా ఇన్‌చార్జి ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. త్వరలో నూతన ఎంపీపీ ఎన్నిక అధికారుల ఆదేశాల మేరకు జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు,ఎంపీడీవో మున్నయ్య పాల్గొన్నారు.

## ఎంపీపీ పదవికి పల్లె కళ్యాణి రాజీనామా



నవతెలంగాణ-చండూరు

చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణి తన పదవికి రాజీనామా చేస్తూ ఆ లేఖను నల్లగొండ జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ ప్రేమకరణ్ రెడ్డికి శనివారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4సంవత్సరాల 9నెలల పదవి కాలంలో నాకు సహకరించిన అధికారులు,అనధికారులు,ప్రజా ప్రతినిధులు,మండల ప్రజలు,మీడియా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే వేముల వీరేశం పూజలు

నవతెలంగాణ-చిట్యాలటౌన్

మండలంలోని మొర్సుగూడెం గ్రామంలో శనివారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కాటం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీ నరసింహ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-చిట్యాలటౌన్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన పట్టణ కేంద్రంలో రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్ వద్ద శనివారం జరిగింది. ఎస్సై సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం ...హైదరాబాద్‌లోని మునగనూర్‌కి చెందిన కంచనపల్లి రమాదేవి (49) హైదరాబాదు నుండి సూర్యాపేటకు శనివారం ఉదయం తన అక్క గాయత్రితో కలిసి కారులో వెళ్తుంది. చిట్యాలలోని రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే కారు రిపేరు అయ్యింది. రోడ్డు పక్కనే ఉన్న రాఖీ కార్ రిపేర్ సెంటర్ వద్ద కారును ఉంచి సూర్యాపేటకు వెళ్లే బస్సుల కోసం వేచి చూడగా అవి రాకపోయేసరికి హైదరాబాద్ తిరుగు ప్రయాణం కోసం రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాదు నుండి నార్కట్‌పల్లి వైపు వెళుతున్న టీఎస్08HQ3888 నెంబర్ గల కార్తు రమాదేవిని ఢీ కొట్టింది. ఆమెను చికిత్స కోసం అంబులెన్స్‌లో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సింగరి నరేష్ చిత్రపటానికి నివాళులు



నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన సింగ రి నరేష్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం ఆయన దశదినకర్మ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ వేరువేరుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. వారి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

## నేరేడుగొమ్ము ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు రాజీనామా

**ఏప్రిల్ 1న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్**

నవతెలంగాణ -దేవరకొండ

దేవరకొండ నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బాణావత్ పద్మ వైస్ ఎంపీపీ ఆరెకంటి ముత్యాలమ్మ తమ పదవులకు రాజీనామా చేశారు. శనివారం జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా నియోజకవర్గంలో పీఏ పల్లి, నేరేడుగొమ్ము ఎంపీపీ లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీలు నోటీసులు అందజేశారు .ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, దేవరకొండ ఎమ్మెల్యేగా బాలు నాయక్ గెలుపొందడంతో బీఆర్ ఎస్ పార్టీకి చెందిన కొంతమంది ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో పీఏపల్లి ,నేరేడుగొమ్ము మండల ఎంపీపీ లను తొలగించేందుకు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నోటీసులు ఇచ్చారు. దీంతో శనివారం పీఏపల్లి మండల ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి (బిఆర్ఎస్) పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది .నేరేడు గోమ్ము మండలం లో 6 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరిలో4గురు బీఆర్ఎస్, మరో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నుండి ఎంపీటీసీలుగా గెలుపొందారు. ఇద్దరు ఎంపీటీసీలు బాలు నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నోటీసులు ఇచ్చారు. ఏప్రిల్ 1వ తేదీన అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అధికారులు ఎంపీపీ ,వైస్ ఎంపీపీ లకు నోటీసులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని, తమకు పదవి లేకున్నా బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని గట్టి సమాధానం ఇచ్చారు. అవిశ్వాస తీర్మానంలో తమ పదవులు పోవడం ఖాయమని భావించి ముందుగానే తమ పదవుల రాజీనామా లను జిల్లా అధికారులకు అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో7 మండలాల్లో దేవరకొండ, చందంపేట, చింతపల్లి ,కొండమల్లేపల్లి, నేరేడు గో మ్ము మండలాల్లో అధికార పార్టీ కాంగ్రెస్ దక్కించుకోగా, డిండి , పీఏ పల్లి మండలాల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీలు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
ఆదివారం మార్చి 31. 2024 www.navatelangana.com

## నూతన దంపతులను ఆశీర్వదించిన జెడ్పీటీసీ

**నవతెలంగాణ-చివ్వెంల**

మండలపరిధిలోని మొగ్గయ్యగూడెం గ్రామపంచాయతీ ఆవాసం రోలబండతండా వాస్తవ్యులు, మాజీ వార్డుసభ్యులు బానోతు ధర్మ,పూలమ్మ కూతురు గాయత్రి, శివల వివాహ వేడుకల్లో బీఆర్ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షులు భూక్యా నాగునాయక్‌తో కలిసి జెడ్పీటీసీ భూక్యాసంజీవనాయక్ పాల్గొని నూతన జంటను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు రాజేష్ నాయక్, హరిచంద్రు, వెంకన్న, రాజశేఖర్, శ్రీకాంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.



## ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా పశువైద్యాధికారి

**నవతెలంగాణ-ఆత్మకూరుఎస్**

మండలంలోని పాతర్ల పహాడ్ గ్రామంలో పశువులకు ఉచితంగా సామూహిక గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను శనివారం మండల పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వేయగా జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతర్లపహాడ్ గ్రామంలో 397 పశువులకు టీకాలేశామన్నారు.ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.



# బీఆర్ఎస్,బీజేపీలకు డిపాజిట్లు గల్లంతు

- బీజేపీకి తెలంగాణ ఓట్లు అడిగే హక్కులేదు
- భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**నవతెలంగాణ-మఠంపల్లి**

రానున్న నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్,బీజేపీలకు డిపాజిట్లు గల్లంతవుతాయని రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌరసరఫరాల మంత్రి నలమాదఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.శనివారం మట్టపల్లి వద్ద జరిగిన కాంగ్రెస్ సభలో ఆయన మాట్లాడుతూ తనజీవితాంతం కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.అందరికీ గుర్తింపు ఇస్తానన్నారు.రాష్ట్ర విభజన సమయంలో రైల్వేకొచ్,స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీలను ఇచ్చేందుకు చట్టంలో చెప్పిన బీజేపీ పాలనలో అమలు చేయలేదన్నారు.ఐటీఐఆర్ హైదరాబాదుకు రావాల్సి ఉండగా మోడీ రాకుండా చేశారని, అందుకే తెలంగాణలో బీజేపీకి ఓట్లు అడిగేహక్కు లేదన్నారు.రైతులు ఆదాయం రెట్టింపు చేస్తానని నమ్మ బలికారని, ఈకాలంలో సగానికిపైగా రైతులు ఆదాయం పడిపోయిందన్నారు. నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు, పేదల ఖాతాల్లో 15 లక్షలు వేస్తామని,ప్రతి పేదవాడికి ఇండ్లు నిర్మిస్తామని చెప్పి ఒకటి అమలు చేయలేదన్నారు.ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ మనుగడ కోల్పోతుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అసభ్య రఘువీర్ రెడ్డి దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలుస్తాడన్నారు. జిల్లాలో చరిత్రలో జరిగని అభివృద్ధి ఈఐదేళ్లలో చేసి చూపిస్తామన్నారు.జిల్లాలో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు.

**కరువుయాత్ర చేస్తానంటున్న కేసీఆర్ సిగ్గుపడాలి**
**రావినారాయణరెడ్డి మెజార్టీ దాటుతుంది**
**రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటొరెడ్డి**



అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలై కేసీఆర్ ప్రజల్లోకి రాలేక కరువు యాత్ర పేరుతో రావాలనుకోవడం సిగ్గుచేటని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.నల్గొండ ఎంపీ ఎన్నికల్లో స్వతంత్రం వచ్చిన తొలినాలలో దేశంలో రావినారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిచాడని, ఈఎన్నికల్లో ఆమెజార్టీ దాటుతుందన్నారు.బీఆర్ఎస్,బీజేపీ అభ్యర్థుల పేరు ఉచ్చరించేందుకు పనికిరావన్నారు.పనిచేసే ప్రభుత్వం తమదన్నారు.హుజూర్‌నగర్, నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధిక మెజార్టీ తెస్తామన్నారు.శ్రీశైలం ప్రాజెక్టును జగన్‌కు తాకట్టుపెట్టి కేసీఆర్ దొంగనాటకం ఆడుతున్నారని,ఎన్నికల అనంతరం కనుమరుగు అవుతారన్నారు.మోడీ మత ఘర్షణలతో రాజ్యం ఏలుతున్నారని,ఆయన ఆటలు సాగవన్నారు.రఘువీర్‌రెడ్డి ఎనిమిది లక్షల మెజార్టీతో గెలుస్తారన్నారు.

**జానారెడ్డి తన వారసులను పార్టీకి అందించారు**
**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

జానారెడ్డి తనసుదీర్ఘ రాజకీయ జీవితంలో బడుగు,బలహీన వర్గాలకు అండగా ఉన్నాడని ఆయన కోవలోనే నడిచేందుకు తన కుమారులును పార్టీకి అందించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.జానారెడ్డి తన రాజకీయ గురువని తనను ఖమ్మం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని చెప్పింది ఆయనే అన్నారు.

**25 ఏండ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్నాను**
**మాజీ మంత్రి జానారెడ్డి**

తన 25 ఏండ్ల వయస్సు నుండి ప్రజల కోసం పనిచేస్తున్నానని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు.వీర తెలంగాణ సాయుధ పోరాటం, మావోయిస్టు మూలాలు ఉన్న ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘకాలం పని చేశానని జిల్లాను ఎంతో అభివృద్ధి చేశానని మరింత అభివృద్ధి చేయాలని తపనతో తన కుమారుల సైతం ప్రజా ప్రతినిధులను చేస్తున్నానన్నారు.ఈ సభలో నల్లగొండ,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు శంకర్‌నాయక్, చెవిటి వెంకన్న, సీనియర్ నాయకులు సామలశివారెడ్డి, మండల అధ్యక్షుడు భూక్యా మంజునాయక్, తన్నీరుమల్లికార్జున్, ఈడుపుగంటి సుబ్బారావు, దొంగరివెంకటేశ్వర్లు, అల్లం ప్రభాకర్‌రెడ్డి రామిశెట్టి అప్పారావు, సింగారపు సైదులు, భీముడు, సక్రు, గోపాల్, గూడెపు శ్రీను,సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

**నవతెలంగాణ-కోదాడరూరల్**

రాష్ట్రవ్యాప్తంగా రబీసీజన్‌లో ఎండిపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్ లో రైతు సంఘం పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.



ఈ రబీ సీజన్‌లో రైతాంగం వేలాది ఎకరాలలో వరిపంట వేసి భూగర్భజలాలు అడుగంటి పోవడంతో సాగర్ ఎడమ కాలువ నీటి విడుదల లేక వేసిన పంటలు ఎండిపోయి రైతాంగం నష్టానికి గుర య్యార న్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రైతు అప్పుల పాలయ్యారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులు ఎండిపోయిన పంటలను పరిశీలించి ఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు.ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఏనుగుల వీరాంజనేయులు, నెమ్మాని సంగమయ్య, గొర్రె ముచ్చు మరియన్న, సీఐటీయూ పట్టణ కార్యదర్శిఎం.ముత్యాలు,కె.వెంకటేశ్,జి.నాగరాజు, సైదులు పాల్గొన్నారు.

## సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించిన భగత్‌సింగ్

**నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్**

స్వాతంత్ర్యం అంటే పాలకులు మారడం కాదు..సమాజంలో అసమానతలు పోయి, ప్రతి మనిషి స్వేచ్ఛగా బతకడం అని చెప్పిన భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం పోరాడాల్సిన అవసరం నేటి విద్యార్థి,యువతరం మీద ఉందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ అన్నారు.భారత స్వాతంత్ర్య సమర యోధులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల 93వ వర్ధంతిని మండలంలోని ఏపూర్ గ్రామంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కోశాధికారి బండిరవి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, అరుణోదయ జిల్లా కార్యదర్శి కంచనపల్లి సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కె జిలేరు, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు నల్లగొండ నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోదు మధు, పీడీఎస్‌యూ జిల్లా డివిజన్ అధ్యక్షులు పిడమర్తి భరత్,అరుణోదయ డివిజన్ కార్యదర్శి ఎర్ర ఉమేష్,అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షులు బోల్లే వెంకన్నపీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు మున్నా అశోక్ పాల్గొన్నారు.

## ఉపాధికూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలి

**నవతెలంగాణ-మద్దిరాల**

ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా కనీస కూలీ 600 రూపాయలతో పాటు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యులు పేర్ల నాగయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మండలంలో రెడ్డిగూడెంలో ఉపాధిహామీ పనులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నరసన్న, నాగెల్లి శ్రీనివాస్, గుండాల వెంకన్న, నాగేంద్రాచారి, ధనమ్మ, వెంకటమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మండే ఎండ... ఉపాధికేది అండ..!

- ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్న ఉపాధికూలీలు
- సేదదీరేందుకు చెట్ల నీడే దిక్కు
- ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నా పని ప్రదేశాల్లో కనిపించని వసతులు
- ఊసే లేని వేసవి అలవెన్స్ • తాగునీరూ కరువే

**నవతెలంగాణ-తుంగతుర్తి**

గ్రామాల్లో వలసలు తగ్గించి స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో గతంలో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి.పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం,అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఉపాధి కూలీలు నానాఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పూట గడవాలంటే ఉపాధిపనులకు వెళ్లక తప్పని కూలీలు, అసౌకర్యాల లేమితో ఎండలో నానాఅవస్థలు పడుతూ ఉపాధిపనులు చేస్తున్నారు.ప్రస్తుతం గ్రామాలకు దూరంగా ఉన్న చెరువుల్లో గుంతలు పూడిక తీసే పనులు కొనసాగుతున్నాయి.

**పని ప్రదేశంలో వసతులు కరువు**

ఎర్రటి ఎండలో భానుడు భగభగ మండుతుండటంతో కూలీలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని పనులు చేసుకోవాల్సి వస్తుంది.ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ,మంచినీరు,ఫస్ట్‌ఎయిడ్ కిట్లు,మజ్జిగ,ఓఆర్ఎస్ లాంటివి సమకూర్చాలి,కానీ నాలుగేండ్లుగా కనీసం తాగునీరు లేకపోవడంతో కూలీలు తమవెంట నీళ్ల బాటిల్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అంతేకాకుండా గ్రామం నుంచి ఎక్కడో దూరంలో ఉన్న ప్రాంతంలో ఉపాధి పనులను గుర్తించి చేస్తుండడంతో కూలీలు ప్రతిరోజు 3నుంచి 5 కిలోమీటర్ల మేర నడిచి వెళ్తున్నారు.

**నిలువ నీడ లేక తిప్పలు పడుతున్న కూలీలు**

వేసవికాలం కావడంతో ఉదయం 8 గంటల నుంచి ఎండ మండిపోతుంది.గంటల తరబడి పనులు చేస్తున్న కూలీలు అలసటకు గురై కొంత సమయం సేదదీరుదాము అనుకున్నాపని ప్రదేశంలో నీడ ఉండటం లేదు. గతంలో పని ప్రదేశంలో టెంటు వేసేవారు.మళ్లీ అలాంటి అవకాశాలు కల్పించాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధి కూలీలకు గతంలో కల్పించిన వసతులు**

ఎండ నుంచి కూలీలు ఉపశమనం పొందేందుకు టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేసేవారు.తాగునీటితోపాటు మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేసేవారు.ప్రథమచికిత్స కిట్లు అందుబాటులో ఉండేవి.వేసవిని దృష్టిలో ఉంచుకొని మార్చి నుంచి మూడు నెలల పాటు అదనపు అలవెన్సులు ఇచ్చి ప్రోత్సహించేవారు. గడ్డపార పార పంపిణీ చేసేవారు సొంతంగా తెచ్చుకొని వినియోగించే వారికి అదనంగా వేతనం చెల్లించేవారు.

**ప్రస్తుతం అమలు తీరు**

మజ్జిగ ఓఆర్ఎస్‌ల మాట దేవుడు ఎరుగు త్రాగునీరు కూడా ఇవ్వడం లేదు.టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేయకపోవడంతో కూలీలు చెట్ల కింద సేద తీరుతున్నారు.గడ్డపార పంపిణీ చేయడం లేదు,ప్రథమ చికిత్స కిట్లు కనిపించడం లేదు.వెలిశాల గోపాలకృష్ణ ఉపాధికూలీ అన్నారం గ్రామపంచాయతీపనులు చేస్తున్న ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదు.ఎండకు కొంతసేపు సేద తీరాలన్న పనులు చేసే చోట నీడ కరువైంది.గడ్డపార పంపిణీ లేదు.ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచడం లేదు. ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుంటల్లో పనులు చేపిస్తున్నారు.చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాం.



జిల్లా వివరాలు
మండలాలు- 23
గ్రామపంచాయతీలు- 475
మొత్తం జాబ్ కార్డులు-2,61,000
పనికి వెళ్లే జాబ్ కార్డుల సంఖ్య-184000
మొత్తం కూలీల సంఖ్య-5,69,000.
పనికి వెళ్లే కూలీల సంఖ్య-3,45,000

**కూలీలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం**
**ఏపీఓ లింగు కృష్ణయ్య**

ఉపాధిపనులకు వస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.ప్రభుత్వ నుంచి టెంట్లు ఫస్ట్ఎయిడ్ కిట్లు, పార,గడ్డపార రావడం లేదు.స్థానిక ఏఎన్ఎంల వద్ద నుంచి ఫస్ట్ ఎయిడ్ కిట్లను తీసుకొని పని ప్రదేశంలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం.మిగతా వసతుల గురించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశం ప్రకారం ప్రతిపాదనలు పంపిస్తాం.

## సూర్యాపేటను పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేస్తాం

**నవతెలంగాణ-సూర్యాపేట**

సూర్యాపేటను పారిశ్రామికరంగంగా మరింత అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక విజయవాడ జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన వాసది ఫ్యాషన్ హబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎదురు చూడకుండా స్వయంగా రాణించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువ పారిశ్రామిక వ్యక్తులకు రెడ్‌కార్పొరేట్ వరుస్తుందన్నారు.జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్లకుండా సూర్యాపేటలోనే వినియోగదారులకు అన్ని రకాల వస్తువులు లభిస్తున్నాయని పేర్కొన్నారు. యువ వ్యాపారులు పరిశ్రమలు ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొప్పులవేణారెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, కౌన్సిలర్స్ కక్కిరేణి శ్రీనివాస్, జహీర్,గండూరి రమేష్, రాపర్తి శ్రీనివాస్ ,దిలీప్ రెడ్డి,చంద్రునాయక్, శబరిషాపు యజమాని వాస ఉమారాణి, శబరినాథ్, మహేష్,బిందు, ఈగ రాములు తదితరులు పాల్గొన్నారు.



## ముస్లిములకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది

**నవతెలంగాణ-సూర్యాపేట**

రంజాన్ మాసం ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైనదని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు.రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం సోదరులకు శుక్రవారం రాత్రి స్థానిక 16 వ వార్డులోని మసీద్‌లో కౌన్సిలర్ షేక్ జహీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు.సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదరభావంతో ఉండాలన్నారు.రంజాన్ పండు గతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షించారు.రంజాన్ మాసం ఉపవాసంతో మంచితనం,సంస్కారానికి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు.ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి ఉపవాసదీక్ష చేపట్టిన ముస్లిములకు ఖర్జూరాలు,పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విడిపించారు.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పులవేణారెడ్డి,పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ,ముఫ్తీ అస్రార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

**నవతెలంగాణ-తుంగతుర్తి**

ఈనెల 18న ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం సాంఘికశాస్త్రం పేపర్‌తో ప్రశాంతంగా ముగిశాయి. తుంగతుర్తి మండలకేంద్రంలో నాలుగు పరీక్షాకేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాశారని మండల విద్యాధికారి బోయిన లింగయ్య తెలిపారు.పరీక్షలు ముగియడంతో పరీక్షాకేంద్రాల వద్ద విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ సందడి చేశారు.మరోపక్క పరీక్షలు ముగియడంతో రెసిడెన్షియల్ పాఠశాలల వద్ద తల్లిదండ్రులు పిల్లలను తమ గ్రామాలకు తీసుకువెళ్లడానికి వచ్చారు. పిల్లలు తమ సామగ్రి సర్దుకుని ఆరేండ్లు ఆ పాఠశాలతో, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని పెనవేసుకుంటూ భావోద్వేగానికి లోనై వీడలేమంటూ..వీడిపోమంటూ...వెళ్ళిపోతున్నామని స్వగ్రామాలకు పయనమయ్యారు.

## నేడు తుంగతుర్తికి మాజీ సీఎం కేసీఆర్ రాక

**నవతెలంగాణ-తుంగతుర్తి**

బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అర్వపల్లి, తుంగతుర్తి మండలాల్లో ఎండిన వరి పంటలను పరిశీలించేందుకు ఆదివారం వస్తున్నట్లు బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు తాటికొండ సీతయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయకపోవడంతో రైతులు వేసిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారని తెలిపారు. దీంతో కరువు రైతుకు బాసటగా కేసీఆర్ ఎండిన వరి పంటలను పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ఘనంగా రన్‌ఫర్ జీసస్

**నవతెలంగాణ-సూర్యాపేట**

గుడ్‌ఫ్రైడే రోజు ఏసుక్రీస్తు పరలోక ప్రాప్తి చెంది ఆ మరుసటి రోజు ప్రభువు పునరుస్థానం చెందారని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎం ప్రభుదాస్ తెలిపారు.సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసస్ కార్యకమాన్ని శనివారం స్థానిక చర్చి కాంపౌండ్ వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మెన్ మామిడి శ్యామ్సన్, జిల్లా ఎలక్షన్ చైర్మెన్ జాకబ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావు, పట్టణ సలహాదారుడు జోహార్‌పాల్, పట్టణ అధ్యక్షుడు జలగం డేవిడ్ రాజ్, మత్తయి, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి సంఘ పెద్దలు, కార్యవర్గ సభ్యులు, విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వం

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

**నవతెలంగాణ-సూర్యాపేట**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు.ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో శానిటైజేషన్ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులను హాస్పిటల్ సూపరింటెండెంట్ ఏడాది కింద అక్రమంగా తొలగించడంతో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఆయన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. శనివారం తిరిగి ఉద్యోగం పొందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దామోదర్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ అక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. డబ్బులు తీసుకొని నచ్చిన వారికి ఉద్యోగాలుగా నియమించుకున్నారని, డబ్బులు ఇవ్వని వారిని అకారణంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. కారణం లేకుండా విధుల నుండి తొలగించారని దీనిపై ఏడాది నుండి న్యాయ పోరాటం చేస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ హాస్పిటళ్లలో జరుగుతున్న అవినీతిపై ఫిర్యాదు చేయడం జరిగిందని, ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం సూపరింటెండెంట్‌పై చర్యలకు ఉపక్రమించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేణి, దుర్గ, సంధ్య, జనమ్మ, అనిత, ఝాన్సీ కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సీతారామచంద్రస్వామి పుష్పయాగం

**నవతెలంగాణ-నాగారం**

మండల పరిధిలోని ఫణిగిరి శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవలలో బాగంగా శుక్రవారం రాత్రి పుష్పయాగం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మాదాయ చైర్మెన్ గట్టు లక్ష్మీకాంత్ (నర్సింహారావు) వైస్‌చైర్మెన్ కల్లెట్ల పల్లి సోమయ్య ,నాతి వీరమల్లు, ఆచార్యులు, కురేశం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ బీఎస్.లత

**నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధహోదాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును నియోజక వర్గాల పరిధిలో ఏర్పాటు చేసే ఓటర్ పేసిలిటేషన్ (వీఎఫ్‌సీ) కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు.శనివారం ట్రాక్టర్ సమావేశ మందిరంలో ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఉద్యోగులు ముందుగా ఫామ్ 12డిని పొందాలని, తదుపరి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని, ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరిగిందన్నారు.తదుపరి పోలీస్, విద్యుత్, హెల్త్, ఆర్‌టీసీ, పౌరసరఫరాల శాఖ, అగ్నిమాపకశాఖ, సమాచారశాఖ, రవాణాశాఖల వారీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు ఎఫ్‌డీఓ రూపేందర్‌సింగ్, ఆర్‌టీఓ సురేష్‌రెడ్డి, డీఎఫ్‌ఓ (ఫైర్) షణ్ముకరావు, ఆర్‌టీసీ డీఎం సురేందర్, విద్యుత్ శాఖ డీఈ డి.నాయుడు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల బంగారు భవిష్యత్తే ఎండీఆర్ పాఠశాల లక్ష్యం



**నవతెలంగాణ-హుజూర్‌నగర్**

పట్టణంలోని ఎండీఆర్ పాఠశాలలో శనివారం 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల చైర్మెన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలో సిలబస్ తయారు చేసుకొని విద్యార్థులకు విద్యాబోధన చేయడం, విద్యార్థుల భవిష్యత్‌కుబంగారు బాటలు వేయడం తమ పాఠశాల ప్రత్యేకత అన్నారు.వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని బోధించడం విద్యార్థులు అవగాహన శక్తిని పెంపొందించడం మా పాఠశాల ఉద్దేశమన్నారు.ప్రిన్సిపాల్ నలబోలు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులను అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం విద్యార్థులకు వివిధ రకాల శాస్త్ర సాంకేతిక విషయాలపై అవగాహన పెంపొందించడం ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడం తమ పాఠశాల లక్ష్యమన్నారు.ఏఐఎంఎస్ టాలెంట్ టెస్ట్ ఐఐటీ ఫౌండేషన్ వంటి విషయాలలో తమ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.పోటీ పరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో నర్సిరెడ్డి,పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-నాగారం**

మండలంలోని ఫణిగిరి ఆనంద గార్డెన్స్‌లో మాచిరెడ్డిపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శీల రవీందర్ యాదవ్-విజయ వివాహ వేడుకలో శనివారం శాసనసభ్యులు మందుల సామేలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాచిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్, పసుపులేటి ప్రేమలతా వెంకట్ రెడ్డి ,మండల నాయకులు కన్నెబోయిన వెంకట్ బిక్షం, నాగారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యాలమకంటి సోమన్న, మండల టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయికుమార్, భయం వెంకన్న, భయం లింగయ్య, గుడ్డేటి సురేష్, చేను ఉమేష్, మాచిరెడ్డిపల్లి ఎన్ఎస్‌యూఐ గ్రామ శాఖ అధ్యక్షులు నాతి శ్రీనివాస్, తాడోజు అజయ్, తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
ఆదివారం | మార్చి 31, 2024 | www.navatelangana.com

## తుంగ బాలుకు వరంగల్ టికెట్ ఇవ్వాలి



**నవతెలంగాణ-రాజపేట**

2004 నుండి తెలంగాణ ఉద్యమంలో ,బీఆరెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ కోసం అనునిత్యం పని చేసామని, ఇప్పటి వరకు ఎలాంటి పదువులు కోసం ఆశించకుండా పార్టీ కోసం పని చేసామని, వివేకంతో కూడిన రాజకీయాలకు ప్రతీక తుంగ బాలుకు వరంగల్ ఎంపీ టికెట్టు ఇచ్చి విద్యార్థి ఉద్యమకారులను గౌరవించాలని కోరారు. శనివారం వారు సోషల్ మీడియా ద్వారా బహిరంగ లేక విస్తృతంగా ప్రచారం చేశారు.రాజాపేట మండలం రఘునాథాపురం గ్రామానికి చెందిన దళితుడు తుంగ బాలు తెలంగాణ , తెలుగు సమాజానికి పరిచయం అక్కర్లేని పేరు అని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన వీరుడిగా అందరికీ తెలుసునని, మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి క్రమశిక్షణగల సైనికుడిలా పనిచేస్తురని లేఖలో పేర్కొన్నారు.

## ఘనంగా సాయి యాదాద్రి వృద్ధాశ్రమం వార్షికోత్సవం

**నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్**

చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో సాయి యాదాద్రి వృద్ధాశ్రమం నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు వికలాంగులకు దుప్పట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమం ఫౌండర్ మేరెడ్డి సత్యనారాయణ రెడ్డి జానకమ్మ దంపతులు పెద్ద కొండూరులో తన సొంత డబ్బులతో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి వృద్ధులకు ఆశ్రయం కల్పించారు.చౌటుప్పల్ మండల ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా విలేకరులకు ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు దెబ్బడి అశోక్,జే.వై శెట్టి,విద్యాసాగర్ రెడ్డి,ఎస్.మహేష్, ఎన్.రాజేంద్రప్రసాద్, ఎస్ శశాంక కుమార్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతి కోసం పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థిగా గెలిపించండి : ఎండీ జహంగీర్

**నవతెలంగాణ-బీబీనగర్**





పేదల అభ్యున్నతి కోసం పోరాడే సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా తానను గెలిపించాలని ఎండీ జహంగీర్ కోరారు. శనివారం బీబీనగర్ మండలం కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుండి సీపీఐ(ఎం) పోటీ చేస్తున్న సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ధనర్జనే ధ్యేయంగా పోటీలో ఉన్నారన్నారు. వారి స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను మభ్యపెడుతూ బూరడి కొట్టిస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని అన్నారు. కాబట్టి ప్రజలు ఆలోచించి ప్రజల సేవకై పరితపించే నాయకులను పార్లమెంటుకు పంపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి గతంలో భువనగిరి పార్లమెంటు మెంబర్ గా ఉండి చేసిందేమీ లేదన్నారు. తన షేర్ మార్కెట్ వ్యాపారం అభివృద్ధి చేసుకోవడం కోసం తన వ్యాపార సంస్థల్ని పురోగతి సాధించడానికి మాత్రమే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడని అన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం అందలానికి ఎక్కిస్తానని గతంలో హామీ ఇచ్చి నెరవేర్చడంలో మాత్రం శూన్యమని అన్నారు. ఎన్నికల్లో రాజకీయ ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులని పోటీలో పెట్టిన విధానం చూస్తే ఆశ్చర్యమేస్తుందన్నారు. ఏ మాత్రం ప్రజా సంబంధాలు కానీ, ప్రజలతో మమేకమై ఉన్న అభ్యర్థులు కాకపోవడం దారుణమన్నారు. ధనార్జన ధ్యేయంగా రాజకీయ ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను పోటీలో నిలిపిందని అన్నారు. ఇప్పుడున్న పార్లమెంటు మెంబర్లను పరిశీలిస్తే 306 మంది కోటీశ్వర్లు అని వీరీ పై క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఇందులో 194 మంది పై మర్డర్ కేసులు, మహిళలపై లైంగికదాడి కేసులు ఎదుర్కొంటున్న వారు అని అన్నారు. ఈ రకంగా రాజకీయ పార్టీలు పార్లమెంటుకు నేర చరిత్ర కలిగిన అభ్యర్థులను పార్లమెంట్ కు పంపిస్తున్నారని అన్నారు. కాబట్టి ప్రజలు తమ ఓటు వేసే ముందు ఆలోచన చేసి ప్రజాసేవ చేసే అభ్యర్థులకు, ప్రజా పోరాటాలు నిర్వహించే వారిని ఎన్నుకొని పార్లమెంటుకు పంపాలని కోరారు. ఈ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడడానికి ప్రధాన కారణం గత ప్రభుత్వాలు అని అన్నారు. సీపీఐ(ఎం) అభ్యర్థి గా తనను గెలిపించినట్లయితే మూసి కాలుష్యం నివారణ కోసం, మూసి ఆయకట్టు రైతులకు గోదావరి జిల్లాలను తాగు, సాగునీరు అందించాడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, గడ్డం వెంకటేష్, మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, బండారు శ్రీరాములు, ఎస్ డి ఉమర్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**



నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆ సంఘం మండల 35వ మహాసభలు వీఆర్ కళాశాలలో కందుల నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గత బిజెపి సర్కార్ నూతన జాతీయ విద్యా విధానం 2020 ని తీసుకొచ్చిందన్నారు. దేశ విద్యార్థుల మేదస్సును కార్పొరేట్లకు తాకట్టు పెట్టే ప్రయత్నం సరైనది కాదన్నారు. విద్యా విధానం వల్ల విద్యార్థులలో మతతత్వ భావజాలాన్ని నింపటానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. పేద విద్యార్థులను దేశ అభివృద్ధిలో మేధస్సును భాగస్వామ్యం చేయాల్సిన ప్రభుత్వాలే, విద్యార్థుల ఐక్యతను దెబ్బతీసే విధంగా రెచ్చగొట్టే విధంగా ఉన్నాయన్నారు. విద్యా విధానం రాజ్యాంగ లక్ష్యాలను చేరే విధంగా విద్యా విధానాన్ని ఏర్పాటు చేయకుండా, ఇష్టానుసారంగా ఆమాలు అమలు చేయడం సరికాదన్నారు. మహాసభలో వివిధ గ్రామాలకు, కళాశాలకు సంబంధించిన, విద్యార్థులు ,ప్రతినిధులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు చెన్న రాజేష్ ,ఎస్.ఎఫ్.ఐ సభ్యులు కంతి విక్రమ్,సాయిని కళ్యాణ్,గందమళ్ళ భువన్,కామున ప్రణయ్,పుట్టల ప్రదీప్, పుట్టల శ్రీరామ్, కూళ్ళ సాయి చరణ్,అజయ్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల 8న ఎంపీపీ ఎన్నికకు ప్రత్యేక సమావేశం

**నవతెలంగాణ-రామన్నపేట**

ఈనెల 30న అవిశ్వాసంపై సమా వేశం జరగాల్సి ఉండగా రెండు రోజుల ముందే ఎంపీపీ రాజీనామా పెట్టడంతో క్యాజువల్ ఖాళీ ఏర్పడింది. ఏప్రిల్ 8న ప్రత్యేక సమావేశం నిర్వహించి, కొత్త ఎంపీపీని ఎన్నుకోవడానికి ఎన్నికల కమిషన్ శనివారం షెడ్యూలు విడుదల చేసిందని స్థానిక ఎంపీడీవో భూక్య యాకూబ్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ నాలుగులోపు ఎంపీటీసీ అందరూ హాజరు కావాలని కోరుతూ సర్క్యులర్ జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.



## కిష్టు సేవలు ప్రశంసనీయం

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**

ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న కిష్టు సేవలు ప్రశంసనీయమని ఆర్డీవో పి.అమరేందర్ అన్నారు. ఆలేరు పట్టణంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కిష్టు పదవి విరమణ సభ, ఏఎస్ ఆర్ గార్డెన్‌లో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగం చేసేటప్పుడు ఎన్నో ఒడిదొడుకులు వస్తాయన్నారు. నిలబడి ఒత్తిడిని జయించి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్జీవో సెక్రెటరీ మందాడి ఉపేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏవో జగన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ, తుర్కపల్లి తహసిల్దార్ దేశి నాయక్,తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**



వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, ఆలేరు మండలంలో ముందస్తు చర్యల్లో భాగంగా స్పెషల్ పండు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల8వేలతో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో, సత్య ఆంజనేయ ప్రసాద్ అన్నారు. శనివారం నవ తెలంగాణతో ఆయన మాట్లాడారు. మండలంలోని 8 గ్రామాలలో గొలనుకొండ గ్రామపంచాయతీ పరిధి వంచగూడెం, పటేల్ గూడెం, కంది గడ్డ తండా, శ్రీనివాసపురం, రాఘవపురం, శర్బనాపురం, గుండ్లగూడెం, భైరవనగర్ గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బోర్లు వేసి తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వేసవిని ఎదుర్కొనేందుకు పంచాయతీ కార్యదర్శులకి ముందస్తు చర్యలకు ఆదేశాలు జరీ చేశామన్నారు. నీటి సమస్యలు తలెత్తినప్పుడు పంచాయతీ సెక్రెటరీలకు ,ఎంపీడీవో కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

## రాజకీయాల్లోకి డబ్బులు సంపాదించడానికి రాలేదు

- పార్టీ సభ్యత్వం శాశ్వతంగా తొలగించిన వ్యక్తికి కాంగ్రెస్ ఎంపీ సీటు
- భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్

**నవతెలంగాణ-భువనగిరి**



నేను రాజకీయాల్లోకి డబ్బులు సంపాదించడానికి రాలేదు..నాకు వంద ఎకరాల భూమి, పెద్ద బంగ్లా ,కార్లు ఉన్నాయని భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాకు డబ్బుల మీద ఆశలేదు మా నాన్న సంపాదించిన వందల ఎకరాల భూమి ఉందన్నారు. తన ఇద్దరు కూతుళ్లు కులాంతర వివాహం చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారని చెప్పారు. ఆస్తులు ,బంగ్లాలు, కార్లు ఉన్నాయి . ప్రజా సేవ చేయడానికి వచ్చాను. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తిని తెలిపారు .భువనగిరి ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ టికెట్ పార్టీ సభ్యత్వం నుండి శాశ్వతంగా తొలగించిన వ్యక్తికి ఇచ్చారని చెప్పారు. ప్రజలు అలాంటి వారిని నమ్మకూడదని ఉద్యమం నుంచి వచ్చిన తనను ఆదరించాలని కోరారు. కురుమ గొల్ల సామాజిక వర్గానికి చెందిన తాను రాజకీయ జీవితం కాంగ్రెస్‌లో ప్రారంభం అయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పని చేసి సామాన్య కార్యకర్త నుండి ప్రారంభమై ఎమ్మెల్యే హెూదాలో ఇబ్రహీంపట్నం ప్రజలకు సేవ చేశానన్నారు. 2013లో రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా పనిచేశానని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా కీలకంగా పనిచేశానని తెలిపారు. నాటి పీసీసీ అధ్యక్షులు ఉత్తంకుమార్ రెడ్డి అవినీతిపరులకు పెద్ద పీట వేశారన్నారు. కేసీఆర్ ఆశీర్వాదం మేరకు భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. అబద్ధాలు, అహంకారపు మాటలతో గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వానికి ఈ ఎలక్షన్లతో బుద్ధి చెప్పాలన్నారు. పంటలు ఎండిపోతున్నా రైతన్నలను పట్టించుకోవడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. రైతులకు అండగా ఉండేందుకు బీఆర్ఎస్ పార్టీ అధినేత రైతులకు భరోసా కార్యక్రమాలు చేపట్టనున్నారని తెలిపారు. ప్రజలకు ఓటు హక్కు ఏకే 47 గన్ కంటే గొప్పదని ప్రధానమంత్రికైనా, పారిశుధ్య కార్మికురాలికైనా సమానమన్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త అహర్నిశలు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ అవినీతిపై, బీజేపీకక్ష సాధింపు చర్యలకు ఎదురు నిలబడి పోరాడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గాదారి కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థిని రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపణతో అతని పార్టీ నించి తొలగించారన్నారు. ప్రస్తుతం అతన్ని వెంటబెట్టుకొని టికెట్ ఇప్పించారన్నారు. ఓటు నోటు కేసులో పట్టుబడ్డ వ్యక్తి పీసీసీ అధ్యక్షులు ముఖ్యమంత్రిగా ఉన్నారని తెలిపారు. అలాంటి వారు ఉన్నప్పుడు అక్రమార్కులకు టికెట్ తప్ప వేరే వారికి వస్తదని ప్రజలు ఆశించడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, గాదరి కిషోర్ భువనగిరి నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు

**నవతెలంగాణ-మోత్కూర్**



ఎండలు తీవ్ర ప్రభావంతో, గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో ఆయన పార్టీ మండల కమిటీ సభ్యులతో కలువిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ఇప్పటికే గ్రామాలలో తాగు నీటి సమస్య నెలకొందని, బావులల్లో, బోర్లలో భూగర్భ జలాలు, అడుగంటి, నీటి ఎద్దడి ఏర్పడిందని అన్నారు. వేసవి తీవ్రరూపం దాల్చకముందే, నివారణ చర్యల్లో భాగంగా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. నీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి, అవకాశం ఉన్న ప్రాంతాలలో నూతన బోర్లు వేయడం, ప్రైవేటు వ్యక్తుల బోర్ల నుండి, బావుల నుండి, నీటిని కొనుగోలు చేయడంతో పాటు, మిషన్ భగీరథ పైపు లైన్లు, ఎప్పడి కప్పుడు మరమ్మతులు చేసి, ఓవర్ హెడ్ ట్యాంక్ లకు నీరు సరఫరా చేసేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పార్టీ మండల కమిటీ సభ్యులు పానుగుల రమేష్, దడిపల్లి ప్రభాకర్, ఎన్నమ్ వెంకటరెడ్డి, కొంపల్లి గంగయ్య పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అన్నదానం చేసిన ఉపేందర్ గుప్తా



**నవతెలంగాణ-రాజాపేట**

రాజాపేట మండల కేంద్రంలో సేవలు అందించే కార్యక్రమంలో భాగంగా పుల్లూరి అనంతలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ పుల్లూరు ఉపేందర్ గుప్తా తన తల్లిదండ్రులు కొల్లూరు అనంతలక్ష్మి, నాగభూషణంల జ్ఞాపకార్థం మృతి చెందిన సామల దత్తాద్రి కుటుంబ సభ్యులకు శనివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్యామల దత్తు అంత్యక్రియల అనంతరం కుటుంబానికి సంతాపం తెలియజేసి బంధువులు, కుటుంబ సభ్యులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుల్లూరు ఉపేందర్ దాతృత్వం పట్ల రాజపేటలోని అన్ని పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు పెద్దలు జర్నలిస్టులు అభినందించారు.మృతుని కుటుంబానికి రూ.22 వేల ఆర్థిక సహాయం పేద కుటుంబానికి చెందిన రాజపేట వాసి శ్యామల దత్తాత్రేయ మృతిచెందగా శనివారం గ్రామస్తుల సహకారంతో స్థానిక బిజెపి నాయకులు కోయం మధు సేకరించిన 22,200 రూపాయలను కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు అందరం కలిసి అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు దాచేపల్లి రాజు, జ్ఞానేందర్ ,బీరు సురేష్, , దాచేపల్లి శ్రీను, విజయ్, వేణు, సంగం మధు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

**నవతెలంగాణ-భువనగిరి**



మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 14న జరిగే భీమ్ యాత్రను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి బండారు రావర్ధన్ తెలిపారు. శనివారం స్థానిక డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ మాసంలో జరిగే మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునే కృషి చేయాన్నారు. ఏప్రిల్ 5 న భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిరావు పూలే ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని అంబేద్కర్ జయంతి రోజున భువనగిరి పట్టణంలో నిర్వహించే భీమ్ యాత్ర లో ఎస్‌టిబిసి మైనార్టీ లంతా ఏకమై సంఘటితం కావాలి అన్నారు. ఈ సమావేశంలో చిలువేరు రమేష్, సిర్పంగా శివలింగం, దుబ్బ రామకృష్ణ, కొల్లూరి హరీష్, ఇటుకల దేవేందర్, కర్కాల రమేష్‌లు పాల్గొన్నారు.

## 2న 2కే రన్‌లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలి

- కలెక్టర్ హనుమంతు కె జెండగే



**భువనగిరి:**ఓటరు చైతన్యంపై ఏప్రిల్ 2 వ తేదీన నిర్వహించే 2 కే రన్ కార్యక్రమంలో ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె జెండగే విజ్ఞప్తి చేశారు. శనివారం కాన్ఫరెన్స్ హాలులో వివిధ నోడల్ అధికారులతో ఆయన సమావేశమై 2 కే రన్ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.వచ్చే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఓటు ప్రాముఖ్యతను తెలియచెప్పేందుకు గాను ఏప్రిల్ 2 వ తేదీన ఉదయం 6.00 గంటలకు భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుంచి స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వరకు, తిరిగి జూనియర్ కాలేజీ వద్దకు 2 కే రన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి కావలసిన అన్ని ఏర్పాట్లను సభా వేదిక, మంచినీరు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వీప్ ప్రచార కార్యక్రమాలలో భాగంగా ఓటు హక్కుపై ప్రజలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ఓటు ప్రాముఖ్యతను తెలియచేసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.ఎ.కృష్ణన్, నోడల్ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సుప్రజ హాస్పిటల్ ను ప్రారంభించిన బీర్ల ఐలయ్య



**నవతెలంగాణ-ఆలేరుటౌన్**

హైదరాబాద్‌లోని నాగోల్‌లో సుప్రజా మల్టిస్పెషల్టి ఆస్పత్రిని శనివారం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా దృక్పథంతో వైద్య సేవలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. అనంతరం ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ,నిర్వాహకులు పాల్గొన్నారు.

## చామల కిరణ్ కుమార్ రెడ్డిని కలిసిన కడారు భాస్కర్

**నవతెలంగాణ-రాజపేట**



భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని రాజపేట యూత్ కాంగ్రెస్ నాయకులు కడారి భాస్కర్ బొమ్మగాని నర్సింలు శనివారం పెద్ద అంబర్పేట్ పార్టీ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. పార్లమెంట్ ఎన్నికల్లో తమ గెలుపునకు కృషి చేస్తామని పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండి క్రమశిక్షణతో పని చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని, భువనగిరి ఖిలాపైన జెండా ఎగురుతుందని తెలిపారు.

## బొడ్డు నరసింహకు నివాళి

**నవతెలంగాణ-వలిగొండరూరల్**



మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన సీనియర్ సీపీఐ(ఎం) నాయకులు బొడ్డు నర్సింహా ఇటీవల అనారోగ్యానికి గురై శుక్రవారం మృతిచెందాడు. ఆయన భౌతికకాయాన్ని శనివారం ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, మాటూరు బాలరాజు, పులిగిల్ల మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, దొడ్డి బిక్షపతి, వేముల చంద్రయ్య ,ఆనంద్, ముత్తయ్య, అమరేందర్ , యేసయ్య, మారబోయిన ముత్యాలు,వేముల నాగరాజు, జ్యోతిబాసు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల స్వీప్ ప్రచారం

**నవతెలంగాణ-భువనగిరి**

పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఐకెపి సిబ్బంది, ఏపీఎం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కలిసి మానవ హారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. నైతిక ఓటింగ్ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ. కృష్ణన్, అడిషనల్ పీడీ శ్రీనివాస్, డీపీఎం సునీల్, పాల్గొన్నారు.

## రామన్నపేట ఎంపీపీగా నాగటి ఉపేందర్



**నవతెలంగాణ-రామన్నపేట**

రామన్నపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు(ఎంపీపీ)గా సీపీఐ(ఎం)కి చెందిన నిర్నేముల ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ నియమితులయ్యారు.ఈ మేరకు శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీగా బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఎంపీపీగా ఉన్న కన్నెబోయిన జ్యోతి బలరాం అనివార్య కారణాలవల్ల రాజీనామా చేయడంతో ఎంపీపీ పదవికి ఖాళీ ఏర్పడింది. దీంతో జెడ్పీ సీఈవో ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో భూక్య నాయక్ ఇన్‌చార్జ్ ఎంపీపీగా నియమిస్తూ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగటి ఉపేందర్ మాట్లాడుతూ అధికారుల, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు.

## ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం

**నవతెలంగాణ-వలిగొండ రూరల్**

మండలంలోని మాందాపురంలో ప్రవాస భారతీయులు సోలిపురం ప్రభాకర్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు సోలిపురం వెంకట్ రెడ్డి, డాక్టర్ రంజిత్ రెడ్డి ల సౌజన్యంతో నిర్మించిన శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 16 వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామీ వారి అమ్మ వార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోలిపురం సాగర్ రెడ్డి, సోలిపురం రాం రెడ్డి, అమరేందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, శ్రీ కాంత్ రెడ్డి, చంద్రకళ, చెన్నారెడ్డి, రాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పదోతరగతి పరీక్షలు

**నవతెలంగాణ-రాజాపేట**

మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో కొనసాగిన పదోతరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. ఈనెల 18న ప్రారంభమైన పరీక్షల్లో మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో నూరు శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ జంగిటి కృష్ణ తెలిపారు. మొత్తం 13 ప్రభుత్వ రెండు ప్రైవేటు పాఠశాలల్లో 370 విద్యార్థులు పరీక్షకు పూర్తి శాతం హాజరయ్యారు. రఘునాథపురం ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 77 మంది, రాజపేట బాలుర పరీక్షా కేంద్రంలో 159 మంది, రాజపేట బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 134 మంది హాజరైనట్లు ఆయన చెప్పారు. పరీక్షలు సజావుగా సాగినట్లు ఆయన వివరించారు.

## క్యామ మల్లేశంను కలిసిన నాయకులు



**నవతెలంగాణ-ఆలేరుటౌన్**

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశును శనివారం ఆ పార్టీ మండల నాయకులు గోట్స్ అండ్ షిప్స్ జిల్లా డైరెక్టర్ జల్లి నర్సింలు, ఏఎంసి మాజీ డైరెక్టర్ పత్తి వెంకటేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ గవ్వల నరసింహులు, రైతు విభాగం పట్టణ అధ్యక్షులు జుకంటి ఉప్పలయ్య, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి దయ్యల సంపత్, నంద ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పూజారి ఆత్మహత్య

**నవతెలంగాణ-ఆలేరుటౌన్**

ఆలయ పూజారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలేరు పట్టణంలో సాయిబాబా ఆలయంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బైపాస్ సమీపంలో గల సాయిబాబా ఆలయ పూజారి శివం పాండే (30) ఆలయంలో తన రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి పంచనామ చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆలేరు ఎస్సై వెంకట శ్రీనివాస్ తెలిపారు.

# సమావేశానికి తరలిన కాంగ్రెస్ మండల నాయకులు



నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

హుజూర్ నగర్ నియోజకవర్గంలోని మట్టంపల్లిలో రాష్ట్ర మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి మండలం నుండి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణ నాయక్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మేరావత్ మునినాయక్,సపావత్ హచ్చు నాయక్,శ్రీను నాయక్, బిచ్యాలు నాయక్, కొండల్, బిక్కు నాయక్, సాంబయ్య, సూర నాయక్, తావు నాయక్, దశరథ్, హనుము, లక్మా, శ్రీను, నాగరాజు, బోజు నాయక్, హట్టి నాయక్, దేవుసింగ్, రాము,హనుమ నాయక్,చీనా నాయక్,జవహర్, సక్కా,తారాసింగ్,శర్మన్, మోహన్, దేవు నాయక్, శ్రీరాములు, మోతి,తదితరులు పాల్గొన్నారు.


నవతెలంగాణ

నల్లగొండ, సూర్యాపేట

యాదాద్రిభువనగిరి

ఆదివారం మార్చి 31, 2024 www.navatelangana.com




# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-చిట్యాలటౌన్

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొలను సునీత వెంకటేష్ అధ్యక్షతన శనివారం సాదాసీదాగా, మొక్కుబడిగా నిర్వహించారు . ఈ సమావేశానికి రావాల్సిన సభ్యులు సర్పంచుల పదవీకాలం ముగియగా, ఎంపీటీసీలలో కొంతమంది హాజరు కాలేదు . ఈ సమావేశంలో పలు శాఖలపై సమీక్షలు నిర్వహించారు. వెలిమినేడు ఎంపీటీసీ దేశబోయిన స్వరూప నరసింహ కరెంటు స్తంభాల గురించి అడుగగా విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు .గ్రామాలలో మంచినీటి నాణ్యతను పరిశీలించడానికి వాటర్ టెస్టింగ్ కిట్స్ ను పంచాయతీ కార్యదర్శులకు నీటి సరఫరా విభాగం అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ పి జయలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ డి రాగ్యనాయక్, వైస్ ఎంపీపీ మర్ల అలివేలు రామిరెడ్డి, రోడ్లు భవనాల శాఖ డిఈ మహేష్ కుమార్ పలువురు ఎంపీటీసీలు ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పల్లెప్రకృతివనం

- నీళ్లు పోసేవారు లేరు
- మొక్కల ఆలనాపాలన కరువు

నవతెలంగాణ-చివ్వేంల

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు నిరుపయోగంగా మారాయి.ఉండ్రుగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం నీళ్లు పోసే వారు లేక, మొక్కల ఆలనాపాలనా చూడక పోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం ఫలించడం లేదు.ప్రభుత్వం గ్రామాలకు కొత్తశోభ తీసుకురావడానికి పల్లె ప్రకృతివనాలను ఏర్పాటు చేయాలని పంచాయతీలకు సూచించింది. దీంతో గ్రామ పంచాయతీలు కొంత భూమిని సేకరించి లక్షకుపైగా నిధులు కేటాయించి ప్రకృతివనాలను ఏర్పాటు చేశాయి. అయితే గ్రామాలలో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతున్నడంతో పల్లెప్రకృతి వనంపై శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.మండలంలోని ఉండ్రు గొండ గ్రామంలో స్థలం లేకపోవడంతో గ్రామానికి సమీపంలోని గుట్టలలో ఏర్పాటు చేశారు.నీళ్ల పోసేవారు లేక మొక్కలు ఎండి పోతున్న పరిస్థితి కనిపిస్తుంది...ఉండ్రుగొండ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు పల్లె ప్రకృతివనంలో



ఎండిపోయిన మొక్కలను చూసి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పల్లె ప్రకృతివనాల ఏర్పాటు కోసం పంచాయతీ నిధులతో పాటు ఉపాధిహామీ చట్టాన్ని వినియోగించుకున్నారు.పల్లె ప్రకృతివనంలో మొక్కలు నాటడానికి కావాల్సిన గుంతలు తీయడానికి, నాటిన మొక్కల నిర్వహణ కోసం ఉపాధిహామీ చట్టంలో పనులు చేపట్టారు. నేలచదును చేయడం, అవసరం ఉన్నచోట మట్టి పోయడం, పంచాయతీ నర్సరీలో ఉన్న మొక్కలు కాకుండా ఆహ్లాదం పంచడానికి కావాల్సిన మొక్కల కొనుగోలుకు పంచాయతీల నిధులు కేటాయించారు. ఒక్క పల్లె ప్రకృతివనం నిర్మాణం కోసం రూపాయలు రూ.2లక్షల నుండి రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు.

**ఆహ్లాదం పంచని వనాలు!!**

ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాల్లో ఎక్కడ ఆహ్లాదం పంచడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ల్లె ప్రకృతివనాలను కొన్నిచోట్ల గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో పల్లె ప్రకృతివనాలకు చేరుకోవాలంటే ఆహ్లాదం మాట పక్కన పెడితే ఆయాసం వచ్చే పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు.మరికొన్ని జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల చెరువులు, కొన్ని చోట్ల శ్మశానవాటికల పక్కన పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేయడంతో పల్లె ప్రజలు ఆహ్లాదం కోసం అక్కడికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.ప్రస్తుతం వేసవి కాలం కావడంతో గ్రామ ప్రజలు సాయంత్రం వేళలో కాసేపు పల్లె ప్రకృతివనంలో సేదతీరుదామని అనుకున్నా అక్కడి వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఒకవేళ వెళ్లినా అక్కడ ఉండే పరిస్థితి లేదని పలువురు వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు కల్పించుకొని పల్లె ప్రజలకు ఆహ్లాదం అందే విధంగా ప్రకృతివనాలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

**పల్లెప్రకృతివనాల నిర్వహణ గ్రామపంచాయతీ చూసుకోవాలి ఏపీఓ నాగయ్య**

పల్లెప్రకృతివనాల నిర్వహణ గ్రామపంచాయతీ చూసుకోవాలి.మొక్కల ఎండిపోకుండా నీళ్లు పోయాల్సిన బాధ్యత గ్రామపంచాయతే తీసుకోవాలి.

# అర్హులందరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు, పోలింగ్ నాడు అత్యవసర సేవల విధులు నిర్వహించే అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు.శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పన పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బీఎస్.లతతో కలిసి మాట్లాడారు.భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం ఎన్నికల విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, వీరి కోసం ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద తప్పనిసరిగా ఓటర్



ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు..తదుపరి కలెక్టర్ ఎస్ఓ వెంకట్రావ్ మాట్లాడుతూ నోడల్ అధికారులు వారికి కేటాయించిన వివిధ అంశాలకు సంబంధించిన అన్ని పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్‌కుమార్, ఆర్డీఓ కోదాడ సూర్యనారాయణ, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, డీఈఓ అశోక్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌టీఓ సురేష్‌రెడ్డి, డీఎస్ఓ మోహన్‌బాబు, డీసీఓ పద్మ తహసీల్దార్లు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీపై వీగిపోయిన అవిశ్వాసం

- కాంగ్రెస్‌కు అధ్యక్ష పీఠాన్ని దూరం చేసిన వర్గ పోరు
- మండలంలో మారనున్న రాజకీయ సమీకరణాలు



నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి

మండలాధ్యక్షుడు వంగాల ప్రతాపరెడ్డి(బీఆర్ఎస్)పై కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. శనివారం స్థానిక మండలాభివృద్ధి కార్యాల యంలోని సమావేశ మందిరంలో దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు ప్రిసైడింగ్ అధికారిగా ప్రత్యేక సమావేశం నిర్వహించగా ఇరు పార్టీలకు చెందిన మొత్తం 14 మంది ఎంపీటీసీలు గైర్హాజరుకావడంతో అవిశ్వాసం వీగిపోయిందని,ప్రస్తుత ఎంపీపీ పదవిలో కొనసాగుతారని తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరుణంలో మండలంలోని ఆ పార్టీకి చెందిన ఓ నేత ఎంపీపీ పీఠంపై కన్నేసి బీఆర్ఎస్‌కు చెందిన వైస్ ఎంపీపీతో సహా నలుగురు అసంతృప్త ఎంపీటీసీలకు తాయిళాలు ముట్టజెప్పి పార్టీలో చేర్చుకొని డిసెంబర్ 11 తేదిన దేవరకొండలోని ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత అధికారిణి సంఘమిత్రకు అవిశ్వాస పత్రాన్ని అందజేశారు.దీనిపై సవాలుచేస్తూ ప్రస్తుత ఎంపీపీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా మూడుమాసాల అనంతరం ఇటీవల అవిశ్వాసం పెట్టుకొవచ్చని న్యాయస్థానం తీర్పు ఇవ్వడంతో 10మంది ఎంపీటీసీలు ఉన్న కాంగ్రెస్ పీఠాన్ని కైవసం చేసుకొవడం ఖాయమని అందరూ భావించారు.కానీ బీఆర్ఎస్ నాయకులు రాజకీయ చతురతతో అధికార కాంగ్రెస్‌లో వర్గపోరును తమకు అనుకూలంగా మార్చుకొని ఎడుగురు ఎంపీటీసీలను క్యాంపునకు తరలించి, కాంగ్రెస్ నేత ఆశలపై నీళ్ళు చల్లింది. మొత్తం 14మంది ఎంపీటీసీలకుగాను అవిశ్వాసం నెగ్గాలంటే 9మంది ఉండాలి. కానీ కాంగ్రెస్ వద్ద ఎడుగురు ఉండటంతో అవిశ్వాసం నెగ్గమని తెలిసి హజరుకాలేదని సమాచారం.త్వరలోనే బీఆర్ఎస్ ముఖ్యనాయకులు అధికార కాంగ్రెస్‌లో చేరుతారని వినికిడి.అవిశ్వాసం వీగిపొవడంతో మండలఅధ్యక్షుడు వై.వల్లపరెడ్డి అధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పటాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు.

# నల్లగొండ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటాం

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌చైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలతో పాటు నల్గొండ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుక ంటామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి తెలిపారు.మట్టపల్లిలో జరుగుతున్న నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం సమావేశానికి వెళ్తున్న సందర్భంగా శనివారం స్థానిక తన నివాసం వద్ద వాహనాల ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిందని, అదే తరహాలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గ నుంచి 50 వేల మెజార్టీతో నల్గొండ, భువనగిరి అభ్యర్థులు గెలుపొందుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పనిచేసి నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధికంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి రాజా, కౌన్సిలర్లు షఫీఉల్లా, వెలుగు వెంకన్న, నాయకులు జ్యోతి కరుణాకర్, సైదిరెడ్డి, వల్దాసు దేవేందర్, గట్టు శ్రీను,పిల్లల రమేష్‌నాయుడు, స్వామినాయుడు, నేరేళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు మృతి

నవతెలంగాణ-గరిడేపల్లి

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చింతకాయల రామచంద్రయ్య మరణం ఈ ప్రాంత ఉద్యమానికి తీరనిలోటని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి షేక్ యాకుబ్ అన్నారు. మండలపరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో శ్రీ రామచంద్రయ్య సాయుధ తెలంగాణ పోరాటంలో మేదరమట్ల సీతారామయ్య శనివారం మృతి చెందారు.ఈ సందర్భంగా ఆయన మృతదేహాన్ని యాకుబ్ సందర్శించి మాట్లాడారు.ఎర్రబోలు లచ్చిరెడ్డి దొడ్డ నరసయ్యతో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తి రామచంద్రయ్యని అన్నారు రామచంద్రయ్య దళాలకు భోజనాలు తీసుకుపోతూ అనేకసార్లు పోలీసు ఒత్తిడీలను ఎదుర్కొని ఉద్యమమే జీవితమని జీవించిన వ్యక్తి రామచంద్రయ్యని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల



సైదయ్య, జుట్టుకొండ వెంకటేశ్వర్లు,బొల్లెపల్లి శ్రీనివాస్,బొమ్మకంటి వెంకయ్య,బంగారు శ్రీను, రాఘవులు,సుందరి సత్యనారాయణ,వలిశెట్టివెంకన్న, జుట్టుకొండ మట్టయ్య, సుందరి వీరరాఘవయ్య ,దొంతగాని లక్ష్మయ్య, కొత్తకొండ సైదులు, పెడమర్తి సైదులు, రేఖ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

తుంగతుర్తి నియోజకవర్గం లోని వెలుగు పల్లి గ్రామంలో గోదావరి జలాలు అందక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించడానికి ఈనెల 31న జరిగే మాజీ ముఖ్యమంత్రి ,బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పర్యటన కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నాయకులు హాజరై విజయవంతం చేయాలని తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గం లోని రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి



జలాలు రాక నాణ్యమైన కరెంటు అందక, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలన కోసం తెలంగాణ జాతిపిత బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తుంగతుర్తి నియోజకవర్గంలోని అర్వపల్లి రహదారి పక్కన వెలుగు పల్లి గ్రామ శివారులో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తారని చెప్పారు. అలాగే రైతుల సమస్యలను తెలు సుకుంటారని చెప్పారు. తిరుమలగిరి మున్సిపల్ కేంద్రం మీదుగా ఉదయం 11 గంటలకు వెలుగుపల్లి గ్రామానికి చేరుకుంటారని ఆయన చెప్పారు.

# ఎంపీపీ పై అవిశ్వాసం ఇందుకే

- బీఆర్ఎస్‌లో ఉంటూ పార్టీకి నమ్మకద్రోహం
- కమిషన్‌ల కోసం ఎంపీటీసీలకు వేధింపులు
- అధికార దుర్వినియోగం తో భూకబ్జాలు : ఎంపీటీసీలు



నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

ఎంపీపీ గుత్తా ఉమాదేవి బీఆర్ఎస్ పార్టీలో ఉంటూనే పార్టీకి నమ్మకద్రోహం చేసిందని, అభివృద్ధి పనులకు సొంత పార్టీ ఎంపీటీసీల దగ్గర కమిషన్ తీసు కున్నదని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూకబ్జలకు పాల్పడిందని ఆరోపిస్తూ అందుకే ఆమెపై అవిశ్వాసం పెట్టామని బీఆర్ఎస్ కు చెందిన 8 మంది ఎంపీటీసీలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే ఆమెపై అవిశ్వాస తీర్మానానికి దరఖాస్తు చేసామని పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై గాని కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత తో అవిశ్వాసం పెట్టలేదని పేర్కొన్నారు. అవిశ్వాసం మునుగోడు ప్రస్తుత ,మాజీ ఎమ్మెల్యేల కు,కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధాలు లేవని పేర్కొన్నారు.కేవలం ఎంపీపీ ప్రవర్తనకు వ్యతిరేకంగా సొంత పార్టీ ఎంపీటీసీలు తీసుకున్న నిర్ణయమే పేర్కొన్నారు. హైకోర్టు స్టే కొట్టి వేయడంతో కోర్టు ఆర్డర్ ప్రకారం అవిశ్వాసంలో పాల్గొంటున్నామని తెలిపారు. ఎంపీపీ భర్త ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పేరు వాడుకొని ఎంపీటీసీల సంబంధీకులు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. అవిశ్వాసం జరిగే రోజున గలాటా చేయడానికి కార్యకర్తలను ప్రేరేపిస్తున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన తొమ్మిది మంది ఎంపీటీసీలలో ఒక ఎంపీటీసీని బెదిరింపుల ద్వారా తీసుకుపోయారని పేర్కొన్నారు. దమ్ముంటే ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రలోభాలకు గురిచేయకుండా అవిశ్వాసాన్ని ఎదుర్కోవాలని పేర్కొన్నారు. ఎంపీపీ గుత్తా ఉమాదేవి ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన నైతికంగా విజయం మాదే అన్నారు.ఏప్రిల్ 1న జరిగే అవిశ్వాసంలో మెజారిటీ ఎంపీటీసీల చేతిలో ఎంపీపీ గుత్త ఉమాదేవి ఓడిపోవడం ఖాయమన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో పాల్గొన్న ఎంపీటీసీలు అంగోతు రాజు, దోటి జంగయ్య, రజిత నరేష్, రాములమ్మ, పెంటయ్య,శ్రావణి జైపాల్ రెడ్డి,శివరాత్రి కవిత విద్యాసాగర్,ఈసం యాదయ్య, నర్రి పావని నర్సింహ ఉన్నారు.

# కరెంట్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ రూరల్ ఏరియాలో ఆదివారం కరెంట్ సరఫరా నిలుపువేస్తున్నట్లు రూరల్ ఏఈ అమర్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కరెంటు మరమ్మతులు చేయుట కొరకు 33 కెవి లైన్ లో ఉట్ల పల్లి సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు 33 కె.వి కరెంటు లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించుట కొరకు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలు ఉట్లపల్లి, యాద్గార్పల్లి, కాల్వ పల్లి, కాల్వ పల్లి తండా, ఎర్రవల్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు కరెంటు గృహ వినియోగదారులు వాణిజ్య వినియోగదారులు రైతులు విద్యుత్ సిబ్బందికి అధికారులకు సహకరించాలని కోరారు.

# దైవచింతనతో మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-చింతపల్లి

ప్రతి ఒక్కరూ అలివేలు మంగ పద్మావతి వెంకటేశ్వరస్వామి అనుగ్రహం పొందాలి. ప్రతి ఒక్కరు శ్రీ అలివేలు మంగ పద్మావతి వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు.శనివారం చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామంలో శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో గత కేసీఆర్ పాలన ఆలయాలకు మహర్దశ వచ్చిందన్నారు..ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి,ఆలయ కమిటీ చైర్మెన్ పూరె లక్ష్మణ్,మాజీ రైతు బంధు అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్‌రావు,



నాయకులు కొండూరు శ్రీనివాస్,బీసీ సెల్ అధ్యక్షులు అండేకార్ అశోక్,బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుతోట నర్సింహ్మ, నాయకులు చింతకుంట్ల విజయ్,కాశగోని వెంకటయ్య,కాశగోని యాదయ్య,బాదేపల్లి పులిరాజు,బాదేపల్లి నీరంజన్,కుంభం శ్రీశైలంగౌడ్, మల్లోజు గోపి,ఆరెకంటి రాధాకృష్ణ,రమావత్ బిచ్యానాయక్,వాంకుడావత్ చందర్‌నాయక్, మామిడి పరమేష్, కోడిదూటి లక్ష్మణ్, ఎర్పుల జంగయ్యసిమర్ల శ్రీను యాదవ్,జిట్టా జగదీష్, గడ్డం శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



- వారి నుంచి ప్రాణ హాని ఉన్నది...రక్షణ కల్పించాలి
- విలేకర్ల సమావేశంలో బాధితులు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, వారి నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని బాధితులు చల్లా శ్రీనివాస్, కొండా సైదులు కోరారు. శనివారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని గూడూరు శివారులో సర్వేనెంబర్ 29/6/1/1 లో వంశంపారపరంగా చల్లా శ్రీనివాస్ బంధువులకు చెందిన 7 ఎకరాలు వ్యవసాయ భూమి ఉందని ఆ భూమిని 2017 లో విక్రయించామని తెలిపారు. అందులో చల్ల శ్రీనివాస్ కు సంబంధించి సుమారు పది గుంటల భూమి ఉందనిఆ భూమి మాదే అంటూ పట్టణానికి చెందిన రియల్టర్ పెద్ది సైదులు, కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించారు. ఆ భూమిపై వారికి ఎలాంటి హక్కు లేదని, న్యాయపరంగా ఉంటే కోర్టులో చూసుకోవాలని సూచించామని తెలిపారు. అయినప్పటికీ పై ముగ్గురితో పాటు మరి కొంతమంది దౌర్జన్యంగా భూమిపై వేసిన కడియలు, కంచెలు తొలగించారని చెప్పారు. పైగా శుక్రవారం రాత్రి హౌసింగ్ బోర్డ్‌లోని తమ కార్యాలయం పై వారితో పాటు మరికొంతమంది దౌర్జన్యానికి దిగి దాడి చేసి గాయపర్చారని తెలిపారు. పైగా నానా దుర్భషాలు లాడరని ఆరోపించారు. జరిగిన దాడి పై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దాడికి పాల్పడిన పై ముగ్గురితోపాటు మరి కొంతమందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలన్నారు.

# కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-భువనగిరి

జిల్లాలో ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి చేపట్టే ధాన్యం కొనుగోళ్ల పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.ఎ.క్రిష్ణన్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. శనివారం యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐకేపీ అధికారులు, సీసీలు, మెప్మా సెంటర్ల నిర్వాహకులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ప్రతి మండల కేంద్రంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నందున రైతుల నుండి ధాన్యం కొనుగోళ్లకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే15 తేదీ లోగా మొత్తం 323 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, వీటిలో 85 ఐకేపి కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందేలా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తత అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 ధర చెల్లించనున్నట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి, టెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. తేమ కొలిచే యంత్రాలు, ధాన్యం శుద్ధి యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపి కష్ణ, అడిషనల్ పీడీ శ్రీనివాస్, డీపీఎం సునీల్, పాల్గొన్నారు.

# వన్య ప్రాణులను రక్షించాలి

- జింక మృతికి అధికారులే బాధ్యత వహించాలి
- కొడారి వెంకటేష్. సామాజిక కార్యకర్త



నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అభయారణ్యం లో శనివారం వీధి కుక్కలు జింక పై దాడి చేసి చంపి తిన్న సంఘటన చాలా బాధాకరమైన సంఘటన అని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి నృసింహ అభయారణ్యం పేరుతో లక్షల రూపాయలు ఖర్చుచేసి వన్యమృగ సంరక్షణ కేంద్రంను రాయగిరి సమీపంలో ఏర్పాటు చేసిందని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ, సెంట్రీ కాపలాతో వన్య ప్రాణులకు నిరంతరం రక్షణ కల్పించాలి కానీ గత కొంత కాలంగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా వన్య ప్రాణులకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. సెంట్రీ ల నిర్లక్ష్యం కారణంగానే ఊర కుక్కలు అభయారణ్యం లోకి ప్రవేశించి జింక ను వేటాడాయని ఆయన ఆరోపించారు. సెంట్రీ డ్యూటీ చేసే వారు అభయారణ్యం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ ను నిరంతరం పరిశీలించాలని, బయటి జంతువులు లోనికి రాకుండా, లోపటి జంతువులు బయటకు వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

# ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారం తో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు శనివారం జరిగిన సోషల్ పరీక్షతో పూర్తయ్యాయి. విద్యాధికారుల ఆదేశాలతో మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి 718 మంది విద్యార్థులు పరీక్షలుహాజరు కావలసిన ఉండగా ఇద్దరు విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారు.వారందరికీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మండల విద్యాశాఖాధి బాలునాయక్ చర్యలు తీసుకున్నారు. ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్లు పర్యటిస్తూ పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.చివరి రోజు ఇద్దరు గైర్హాజరయ్యారు. చివరి రోజున విద్యార్థులు ఉత్సాహంతో పరీక్షకు హాజరయ్యారు. పబ్లిక్ పరీక్షల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలగడంతో విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో కేరింతలు కొడుతూ పరీక్ష హాలు నుంచి బయటకు వచ్చారు. హాస్టల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

# యువతకు స్ఫూర్తి ప్రదాత డాక్టర్ ముస్తాక్ అహ్మద్

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రఖ్యాత చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ ముస్తాక్ అహ్మద్ యువతకు స్ఫూర్తి ప్రదాత అని నల్లగొండ జిల్లా ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ కొనియాడారు. పలు ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు పంపిణీ చేసేందుకు డాక్టర్ ముస్తాక్ అహ్మద్ ముందుకొచ్చారు.శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రంజాన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముజీబ్ రెహ్మాన్, నజీర్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి :ఎమ్మెల్యే

నవతెలంగాణ - తిరుమలగిరి

తుంగతుర్తి ప్రజలకు రైతాంగానికి బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్షమాపణ చెప్పి ఈ గడ్డమీద అడుగు పెట్టాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీ నగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో తెలంగాణ రాష్ట్రాన్ని పది సంవత్సరాలు ఏలిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాంత ప్రజలకు ఏమి చేశారో ఎందుకు కరువచ్చిందో వివరించాలని అన్నారు. అవినీతి కుంభకోణాలు, ఫోన్ ట్యాపింగ్, భూదందాలు, ఇసుక రవాణా ప్రశ్నించిన వారిపైన దాడులు చేయడం మూలంగానే ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకొని కరువు పేరుతో చేపట్టిన యాత్రను రద్దు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్సోజు నరేష్,భాస్కర్ నాయక్, బత్తుల శ్రీను, కందుకూరి లక్ష్మయ్య, కందుకూరి అంబేద్కర్,పత్తేపురం సుధాకర్, చాగంటి రాములు, పేరాల వీరేష్,పాలకుర్తి రాజయ్య మద్దిరాల మండల పార్టీ నాయకులు మార్త కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-చింతపల్లి

మండలంలోని కుర్మేడు గ్రామానికి చెందిన ఏకుల రాములు మనుమడి పుట్టిన రోజు వేడుకలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే రమావత్‌ర వీంద్రకుమార్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి హాజరై చిరంజీవిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో రైతుబంధు మాజీ అధ్యక్షులు ఉజ్జిని విద్యాసాగర్ రావు,బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షులు అండేకార్ అశోక్, ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, నాయకులు ప్రసాద్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగికి ఘనసన్మానం



నవతెలంగాణ-నల్గొండటౌన్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నల్గొండ జిల్లా పరిధిలో డ్రైవర్‌గా విధులు నిర్వహించిన పెరుమాళ్ళ రాములు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పెరుమాళ్ళ రాములు ఆయన భార్య సావిత్రిని నల్గొండ ఆర్టిసి డిఎం రామ్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాములు సుదీర్ఘ కాలం పాటు ఆర్టీసీకి అద్భుతమైన సేవలందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం జీవితాన్ని కుటుంబ సభ్యుల మధ్య ఉల్లాసంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ లక్ష్మయ్య, వినయ్ కుమార్, విజయ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-గుండాల

విధుల పట్ల అలసత్వం వహిస్తూ సమయపాలన పాటించకుండా విధులకు గైర్హాజరవుతున్న గుండాల ఎంపీడీవో దేవికపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గుండాల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ స్థానిక మండల ఎంపీడీవో ఇక్కడ విధుల్లో చేరిన నాటి నుండి సకాలంలో విధులకు రాకపోవటం వల్ల కింది స్థాయి అధికారులు సైతం సమయపాలన పాటించడం లేదన్నారు. స్థానిక గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత ఇంచార్జీ అధికారుల పాలనలో పర్యవేక్షణ లోపం వల్ల గ్రామాల్లో ఉపాధిహామీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఎంపీడీవో విధుల పట్ల నిర్లక్ష్యంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# మండుతున్న ఎండలు

- ఇండ్లకే పరిమితమవుతున్న జనం
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాత్రి 7 గంటల వరకు వడగాల్పులు
- వేడెక్కిన ఏసీలు, కూలర్లు, నీళ్లు

నవతెలంగాణ-సూర్యాపేట

కొన్ని రోజుల నుండి ఎండవేడిమికి జిల్లా నిప్పుల కొలిమిగా మారింది. ఎండాకాలం పూర్తి స్థాయిలో జొరబడక ముందే సూర్యుడు 40 డిగ్రీల ఉష్ణోగ్రతల భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎండలు దంచి



కొడుతున్నాయి. ఈ క్రమంలో ఉదయం 8 గంటల నుండి సూర్యుడి ప్రతాపంతో భూభాగం మండేఎండలతో భగభగలు లాడుతుంది. దీంతో చిన్నారులతో పాటు పెద్దలు కూడా ఇంటి నుండి బయటకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనులను ఉంటేనే ఉదయం లేక సాయంత్రం వేళ్లలో మాత్రమే ప్రజలు బయటికి వచ్చి తమ పనులను చేసుకుంటున్నారు. పశువులు, పశుపక్షాదులు నీటికోసం అల్లాడుతున్నాయి. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారాయి. అడపాదడపా వచ్చి పోయే కరెంట్‌తో నెలకొన్న ఉక్కపోతతో పాటు దోమలు మోతతో ఇంట్లో, వీధిలో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇది గాక ఇండ్లలో గాబులు, డ్రమ్ములలో కల నీరంతా కూడా మండే ఎండకు వేడిగా మారుతున్నాయి. ఏసీలు, కూలర్లలో కూడా వేడి గాలి విస్తుండడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఇటివలే ఉష్ణోగ్రత శాతం క్రమంగా 35 నుండి 40 డిగ్రీల వరకు పెరుగుతూ వస్తుంది. వారం రోజులుగా జిల్లాలో 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో మూడు రోజుల నుంచి దంచి కొడుతున్న ఎండతో ప్రజలు సతమతమవుతున్నారు. వృద్ధులు, పిల్లలు వేడిమిని తట్టుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వీస్తున్న వడగాల్పులతో ఇంటా బయట జనం వేడిమిని తట్టుకోలేకపోతున్నారు. ఇదిలావుండగా వివిధ గ్రామాల నుండి పట్టణానికి వచ్చే వారు నీటి దాహార్తితో అల్లాడుతున్నారు. మున్సిపాలిటీ వారు కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

**నిర్మానుష్యంగా రహదారులు....**

మధ్యాహ్నం సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. షాపులు కూడా వెలవెలబోతున్నాయి. ఎండ వేడి నుండి తట్టుకునేందుకు చేతి రుమాలు, టవల్స్, టోపీలు, కళ్ళజోళ్ళు, మహిళలైతే స్కార్ఫ్‌లు, హెల్మెట్లు దరిస్తూ ఎండ నుండి రక్షణ పొందుతున్నారు. ఇదిగాక ఎండ నుండి ఉపశమనం పొందేందుకు చెరుకు రసాలు, మజ్జిగ, ఇతరపండ్ల రసాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. వైరల్ ఫీవర్ వచ్చే అవకాశం ఉందని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. కాగా ఇండ్లల్లో వేడిని భరించలేని పరిస్థితుల్లో చిన్న, మధ్య తరగతి ప్రజలు కూలర్లతో ఉన్నత వర్గాల వారు ఏసీలతో ఉపశమనం పొందాలని ప్రయత్నిస్తున్న అందులో నుండి వచ్చే వేడి వడగాల్పులతో మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఇక రానున్న ఏప్రిల్, మే నెలలో ఎండ తీవ్రత ఏ విధంగా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# రైతులను నిండాముంచిన యాసంగి

- అమలుకాని నీటి విడుదలషెడ్యూల్
- తూతూమంత్రంగానే నీటి విడుదల
- ఎస్సారెస్పీ కింద ఎండిన వరి పంటలు



నవతెలంగాణ-మునగాల

ఈ యాసంగిలో వరి పంటలు సాగు చేసిన రైతులు నిండా మునిగారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లు, బావుల కింద సాగు చేసిన వరి పంట లు నిలువునా ఎండిపోయాయి. పంట ల ను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. వందల సంఖ్యలో బోర్లు వేసినా ఫలితం లేకుండాపోయింది. ఒక్కో బోరుకు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. నీటిమట్టాలు గణనీయంగా తగ్గిపోవడంతో బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. శ్రీరాంసాగర్‌కు షెడ్యూల్ ప్రకారం నీరు వదిలితే రైతులకు ఈ కష్టాలు వుండేవికావు. యాసంగిలో నీటి విడదల షెడ్యుల్‌ను అధికారులు తుంగలో తొక్కారు. ఈ ఏడాది జనవరి 8నుంచి మార్చి30వరకు ఆరు విడతలుగా నీటిని విడుదల చేస్తామని ప్రక టించారు. మొదటి విడత జనవరి 8 నుంచి15వరకు. రెండవ విడత 23నుం చి 30వరకు. మూడవ విడత ఫిబ్రవరి 7 నుంచి14వరకు. నాలుగో విడత22నుం చి 29వరకు. ఐదవ విడత మార్చి8నుం చి15వరకు. ఆరవ విడత 23నుంచి30 వరకు వారబంధి పద్దతిన నీటిని విడు దల చేస్తామని రైతులకు హామీఇచ్చినా అవి ఏమాత్రం అమలుకు నోచుకోలేదు ఇచ్చిన షెడ్యుల్‌ను అమలు చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వారంలో మూడురోజులు కూడా నీరు రాని రోజులున్నాయని రైతులు తెలుపుతున్నారు. ఇచ్చిన రోజుల్లో కూడా కాల్వకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయకపోవడంతో కాల్వ చివరి భూములకు నీరందని పరిస్థితి దాపురించింది. కాల్వకు సుమారు1800క్యూసెక్కుల నీరు విడుదల చేస్తేనే చివరి భూముల వరకు నీరందే అవకాశం వుంది. అయితే ఆస్థాయిలో నీటి విడుదల జరగలేదని రైతులు ఆరోపిస్తున్నారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్, చివ్వెంల, కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె, మునగాల మండలాల్లోని రైతాంగం నీటి కోసం హరిగోసలు పడ్డారు. పొట్ట దశలో వున్న పంట పొలాలు నిలవునా ఎండిపోయాయి. కాల్వపరిధిలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో1.50లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు చేసి రైతులు నష్టాలపాలయ్యారు. వందలాది ఎకరాల్లోపంటలు కోయకుండానే పశువులను మేపుకున్నారు. పంటల సాగుకోసం రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టారు. విత్తనాలు. దుక్కిమందు (డిఎపి)ట్రాక్టర్ దుక్కి దున్నిన కిరాయిలు. కలుపు మందు. నత్రజని ఎరువులు ఇలా ఎకరానికి 20నుంచి 25 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టి రైతులు అప్పుల పాలయ్యారు. నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని వివిధ ప్రాంతాల్లో రైతులు ఆందోళనలు చేసినా పట్టించుకునే దిక్కే లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిపై ఆశలు పెట్టుకున్న రైతులకు ఈ యాసంగి నిరాశే మిగిల్చింది. మండలంలోని మాధవరం, నేలమర్రి, రేపాల, విజయరాఘవాపురం, జగన్నాధపురం, నర్సింహులగూడెం, తాడ్వాయి, వెంకట్రాపురం, కలకోవ గ్రామాల్లోని చెర్వుల్లోకి ఎస్సారెస్పీ నీరు చుక్క చేరలేదు. నీటి పారుదల అధికారుల మాటలు నమ్మి రైతులు నార్లు పోసుకొని దుక్కులు దున్ని నాట్లు వేసి మోసపోయారు. రెండుమూడేండ్లుగా శ్రీరాంసాగర్ నీటితో మాధవరం చెర్వు అలుగు పోసేది. అక్కడి నుంచి మొద్దుల చెర్వు నిండి తాడ్వాయి మీదుగా వాగు పారి చిలుకూరు మండలం బేతవోలు వరకు నీరుపారేది. చెర్వుల కింద వాగుల నుంచి పైపులైన్లు వేసుకొని రైతులు వరిసేద్యం చేసే వారైతే ఈ వేసంగి సీజన్ లో సక్రమంగా రాకపోవడంతో చెర్వులు ఎండి వెలవెలపోతున్నాయి. నాగార్జు సాగర్ ఆయకట్టు పరధిలో వానాకాలం, యాసంగి సీజన్‌లో నీటి విడుదల లేకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. బోర్లు, బావుల కింద మాత్రమే వరి పంటలు సాగు చేశారు. ఈ యాసంగిలో ఆయకట్టు ఎత్తిపోతల పథకాలపరిధిలో బోర్ల ఆధారంతో సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు వరి పంటలు సాగు చేశారు. పొలాలు పొట్ట దశకు వచ్చే సమయానికే బోర్లు బిక్కిపోయాయి. పంటలను బతికించుకునేందుకు రైతులు ఆరుతడి పద్ధతిని అనుసరించారు. మూడు నాలుగు రోజులకు ఒకసారి మడి మడికి నీరిచ్చి కొంతవరకు పంటలను కాపాడుకున్నారు. అయినా కొన్ని మాగాణులు నీటికటకటతో నిలువునా ఎండిపోయాయి. ఏది ఏమైనా ఈ యాసంగిలో రైతులు నీటిఎద్దడి ఇబ్బందులతో తీవ్రంగా నష్టాల పాలయ్యారు.

## ముమ్మరంగా ఆస్తిపన్ను వసూలు

- ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

నవతెలంగాణ-భువనగిరి

ఆస్తిపన్ను చెల్లింపునకు ఆదివారంతో గడువు తేదీ ముగియనుంది. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆరు మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూళ్ల ముమ్మరం చేశారు. భువనగిరి మున్సిపాలిటీలో 70.29 శాతం వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ. 723.09లక్షలు డిమాండ్ కాగా రూ 508.03లక్షలు వసూలు చేశారు. 213.83 వసూళు చేయాల్సి ఉంది. మిగిలిన ఒక రోజు 100 శాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆస్తి పన్ను అసమానతలు, ఇతరత్రా సమస్యలు పరిష్కరిం చేందుకు వీలుగా ఆస్తి పన్ను పరిష్కార వేదికలను ఏర్పాటు చేశారు. బకాయిలపై పడిన వడ్డీపై 90 శాతాన్ని మాఫీ చేస్తూ ప్రభుత్వం వన్‌టైం సెటిల్మెంట్ అవకాశాన్ని కల్పించడంతో అందరూ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపునకు ఇక ఒక్కో రోజు గడువు ఉండడంతో ఆదివారం కూడా చెల్లింపు కౌంటర్ లు తెరిచి ఉంటాయని తెలిపారు. ఎవరు కుడా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆస్తి పన్ను చెల్లింపు చేయొద్దని, నేరుగా మున్సిపాలిటీ కార్యాలయంలో కాని, మీ సేవా కేంద్రంలో, మున్సిపాలిటీ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు మాత్రమే చెల్లింపు చేయాలని కోరారు.

## తేజ విద్యాలయలో 'మాబడి జ్ఞాపకాల ఒడి' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని కొమరబండలోని తేజ విద్యాలయంలో మా బడి జ్ఞాపకాల ఒడి అనే పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథుల చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా మాబడి, జ్ఞాపకాల ఒడి పుస్తకాన్ని విద్యార్థులకు అధ్యాపకులకు అందించి వారు మాట్లాడారు. తేజ విద్యాలయ పాఠశాలలో చదవడం పిల్లల అదృష్టమన్నారు. పిల్లల జ్ఞాపకాలు పది కాలాల పాటు నిలిచిపోయేలా ఈ పుస్తకాన్ని రూపొందించిన తేజ విద్యాలయ యాజమాన్యానికి, పాఠశాల రీసెర్చి, డెవలప్మెంట్ వింగ్‌కు అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్, గమ్యం దేశం గర్వపడేలా ఉండాలని కోరారు. విద్యార్థుల జ్ఞాపకాలు అక్షర సత్యాలని, పుస్తకం వారి జీవిత కాల బహుమతి అని ఆశీర్వచనాలందించారు. అనంతరం ప్రిన్సిపాల్ రమాదేవి సోమిరెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు వారి పాఠశాల జ్ఞాపకాలను



అక్షర రూపంలోకి మార్చి రాసిన ప్రతులను పాఠశాల యాజమాన్యం పుస్తకంగా తీసుకొచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి తేజ విద్యాలయంలో గడిపిన బాల్యం తాలుకు గుర్తులను నెమరవేసుకుని తమ జ్ఞాపకాలను స్వదస్తూరితో రాయడం జరిగిందన్నారు. మొత్తం (38) మంది విద్యార్థులు వారు రాసిన పాఠశాల జ్ఞాపకాలను "మా బడి జ్ఞాపకాల ఒడి" అనే పేరుతో పుస్తకంగా అచ్చు వేయించామన్నారు. ఈపుస్తకంలో విద్యార్థుల జ్ఞాపకాలతో పాటు 2023-24 పదవ తరగతి బ్యాచ్ గురించి అధ్యాపకులు వారి అభిప్రాయాలను జోడించామన్నారు. పుస్తకంలో విద్యార్థులకు అవసరమైన వారి పూర్తి సమాచారంను పొందు పరిచామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చామలను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

కాంగ్రెస్ పార్టీలో గత 20 సంవత్సరాలుగా వివిధ పదవుల్లో నియమ నిబద్ధతతో పనిచేస్తున్న చామల కిరణ్ కుమార్ రెడ్డిని భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించటం అభినందనీయమని యువజన కాంగ్రెస్ చౌటుప్పల్ పట్టణ మాజీ అధ్యక్షులు చెరుకు లింగస్వామి గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు అధిష్టానం సరైన గుర్తింపు ఇస్తుందని అనడానికి నిదర్శనం చామల కిరణ్ కుమార్ రెడ్డికి టికెట్ కేటాయించడం అని అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో భువనగిరి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గురువుల కోసం పిల్లల ఎదురుచూపు

- విద్యార్థులకు తప్పని పడిగాపులు

నవతెలంగాణ-చివ్వెంల

సమాజంలో తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులకు ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనది. ఒక విద్యార్థి భావితరాలకు మార్గనిర్దేశకులుగానిలబడాలంటే ఉపాధ్యాయులు లేనిది ఏదీ సాధ్యం కాదు. కానీ గ్రామీణప్రాంతాల్లో, మారుమూలతండాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పంతుల పరిస్థితి అధ్వానంగా మారిందని పలువురు విమర్శిస్తూ ఉన్నారు. విద్యాబుద్దులు చెప్పాల్సిన టీచర్లకే క్రమశిక్షణ లేకపోతే! పాఠాలు చెప్పడం సంగతి అటుంచితే.. సమయానికి పాఠశాలలకు రాకపోవడంతో, పాఠశాల ముందే విద్యార్థులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిల్లలు చదువుల కోసం పాఠశాలకు వెళ్తున్నా ఉపాధ్యాయులు మాత్రం సమయానికి రారు. విద్యాబోధన చేయరు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా రావడంపోవడం మామూలైపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలోని వల్లభాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు పాఠశాలకు ఇష్టానుసారంగా రావడంతో పిల్లలకు విద్యాబోధన సక్రమంగా జరగడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి రావడమే జరుగుతుందని అక్కడ విద్యాబోధన జరగడం లేదని వారు విమర్శిస్తున్నారు. చిన్న పిల్లలకు తొలిమెట్టులో విద్యాబోధన సక్రమంగా అందకపోవడంతో, నష్టపోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఉదయం 8-00గంటల నుంచి 12-30నిమిషాల వరకు పాఠశాలలు నిర్వహించాలి.. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఉపాధ్యాయులు తమకు యిష్టం వచ్చినట్లు తూతూమంత్రంగా పాఠశాలలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపిస్తే కొంతమంది పంతులు పాఠాలు చెప్పకపోవడంతో పిల్లల భవిష్యత్ ఆగమవుతుందని, అప్పు చేసి మరి ప్రయివేట్ పాఠశాలలకు పంపుతున్నామని కొంతమంది పిల్లలతల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం సమయం 8:22 నిమిషాలకు కూడా ఉపాధ్యాయులు రాకపోవడంతో బడితాళాలు కూడా తీయకపోవడంతో విద్యార్థులు పాఠశాల బయట ఉన్నారు. ఉపాధ్యాయులు సమయానికి విధులకు రాకపోవడంతో విద్యార్థులకు విద్యాబోధన చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు



తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎండలతీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని నిర్ణయించింది. ఒంటి పూట బడులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు వరకు నిర్వహించాలని పేర్కొంది. మధ్యాహ్న భోజనం పెట్టిన అనంతరం ఇళ్లకు పంపించాలని పేర్కొంది. ఉదయం 8-00గంటలకు రావలసిన ఉపాధ్యాయుడు ఉదయం 8-24నిముషాలకు పాఠశాలకు రావడం విశేషం.. వల్లభపురం పాఠశాలలో 16మంది పిల్లలు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నట్లు సమాచారం... 8-24 నిమిషాలకు పాఠశాలకు ఉపాధ్యాయుడు వచ్చి తాళంతీయడం ప్రభుత్వం నిబంధనలను క్రమశిక్షణతో పాటిస్తున్నారో అర్థమవుతుంది. ఇంకొకరు సెలవు పెట్టారా లేదా అనే సమాచారం తెలియాల్సిఉంది. కష్టపడితే గాని పూట గడవని కుటుంబాల పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నారని, వేల రూపాయలు ప్రైవేట్ పాఠశాలలకు ఫీజులు కట్టలేక, తమ పిల్లలు బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించాలని కోరికతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తుంటే వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన గురువులేమో పట్టించుకోక పోవడంతో ప్రభుత్వ పాఠశాలలో చదివిన పిల్లల భవిష్యత్ అంధకారమయంగా తయారవుతుందేమోననే ఆందోళన చెందుతున్నారు. పిల్లల తల్లిదండ్రుల్లో ఉన్న అపనమ్మకాన్ని తొలగించే విధంగా ప్రభుత్వం పాఠశాలలను ప్రక్షాళన చేసే విధంగా, సంబంధిత జిల్లా విద్యాధికారులు స్పందించి, మండలంలోని పాఠశాలపై ప్రత్యేక చొరవ తీసుకొని, సమయ వేళలో ఉపాధ్యాయులు వచ్చే విధంగా విద్యార్థులకు సక్రమంగా విద్యాబోధన చేసేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరారు.

## శ్రీ మత్స్యగిరి ఆలయంలో హుండీలు లెక్కింపు



నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామీ ఆలయంలో గల హుండీలను శనివారం లెక్కించగా 2 నెలల 21 రోజులకు కు గాను రూ.8,20,040/-లు అక్షరాల ఎనిమిది లక్షల ఇరవై వేల నలభై రూపాయలు లబించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మోహన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ నిఖిల్, ఆలయ అర్చకులు, సిబ్బంది, కెనరా బ్యాంక్ మేనేజర్స్ వీరేందర్ రెడ్డి, లాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## పోరెల్లదాసు స్ఫూర్తితో మతోన్మాద బీజేపీని ఓడించాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పోరెళ్ల దాసు స్ఫూర్తితో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. శనివారం దాసు ఆరోవర్ధంతిని పురస్కరించుకొని తిరుమలగిరి మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి యాదగిరిరావు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం విముక్తి కోసం, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా సాగిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పోరెల్ల దాసు భీంరెడ్డి నరసింహారెడ్డి నాయకత్వంలో నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా దొరలు, భూస్వాములు, జాగీర్‌దారుల దాష్టీకాలను నిరసిస్తూ పీడిత ప్రజలను సమీకరించి పోరాటంలో దళనాయకుడిగా ముందుభాగంలో ఉన్నారన్నారు. ఆంధ్రా మహాసభ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగిన పోరాటంలో 4000 మంది ప్రాణాలు అర్పించి 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర ఆనాటి పోరాటానికి ఉందన్నారు. నాడు పోరాటంలో లేని కనీసం ఆయుధం పట్టని మతోన్మాదులు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం హిందూ ముస్లిముల మధ్య జరిగిన ఘర్షణ గా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి. జహంగీర్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుమ్మడి వెల్లి ఉప్పలయ్య, మండల కమిటీ సభ్యులు కడెంలింగయ్య, చిత్తలూరు సోమయ్య, బందెల అబ్రహం, కందుకూరి సోమయ్య, కొత్తగట్టు మల్లయ్య, తన్నీరు రాంప్రభు, కిష్ట్ నాయక్, నిర్మల యాకయ్య, వనం సోమయ్య, తాడికొండ సీతయ్య, దాసు, కుటుంబ సభ్యులు పోరెల్ల సోమయ్య, లక్ష్మయ్య, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

